గురువారం
09-02-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 228
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

శవాల గుట్టలు

భూకంపం మిగిల్చిన విషాదంతో టర్కీ, సిరియా దేశాలు శవాల దిబ్బల్లా మారాయి. అక్కడి వాతావరణంలో మృత్యువు ఘోషిస్తోంది. ఎటు చూసినా శవాలు, భవనాల శిథిలాలు, అర్తనాదాలతో భయానక దృశ్యం ఆవిష్కృతమైంది. శిథిలాల నుంచి బయటపడిన వారి కన్నీటిగాథలు హృదయాన్ని ద్రవింపజేస్తాయి.

2లో

అదానీకి అప్పగింతలు

- అనంతపురం జిల్లాలో రూ.5 లక్షలకే 406 ఎకరాలు
- ఇక పదో తరగతి పాసైతేనే వైఎస్సార్ కళ్యాణమస్తు
- కర్నూలులో న్యాయ విశ్వవిద్యాలయం
- ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలుకు 1610 పోస్టులు భర్తీ
- రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : తీవ్ర ఆర్థిక ఆరోపణలు ఎదుర్కొంటూ గత కొద్దిరోజులుగా ప్రపంచ కుబేరుల్లో రెండో స్థానం నుంచి 20వ స్థానానికి చేరుకున్న అదానీ కంపెనీ లావాదేవీలు పార్లమెంటును ఒకపక్క కుదిపేస్తుండగా, ఏపీ ప్రభుత్వం మాత్రం అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు అనంతపురం జిల్లా పెద్దకోట్ల, దాడితోట గ్రామాల పరిధిలో ఎకరం రూ.5 లక్షల చొప్పున 406.46 ఎకరాలు కేటాయించేందుకు మంత్రివర్గం నిర్ణయించింది. ఆ గ్రామాల్లో 500 మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజీ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఈ భూమిని కేటాయించనున్నారు. ఒకపక్క అదానీ కంపెనీలన్నింటిపై సీబీఐ దర్యాప్తునకు ప్రతిపక్షాలు పట్టుబడుతుండగా, ఏపీ ప్రభుత్వం మాత్రం ఏమీ జరగనట్లు యధాతథంగా భూములు కేటాయించడం విశేషం. బుధవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. దాదాపు 70 అంశాలపై చర్చించిన కేబినెట్ ఈ కింది నిర్ణయాలను తీసుకున్నట్లు సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మీడియాకు తెలియజేశారు. ఫిబ్రవరి 10న వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. వధూవరులు కచ్చితంగా పదోతరగతి పాసవ్వాలన్న నిబంధనను కొత్తగా అమల్లోకి తెచ్చింది. అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ వివాహం చేసుకున్నవాళ్లకు సంబంధించి... జనవరిలో తనిఖీ చేసి ఫిబ్రవరిలో చెల్లించాలని, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలో వివాహం చేసుకున్నవాళ్లకు ఏప్రిల్ నెలలో తనిఖీ చేసి మే నెలలో ప్రతి మూడు నెలలకొకమారు చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గం తీసుకున్న మరిన్ని నిర్ణయాలివే.

- ఫిబ్రవరి 17న వైఎస్ఆర్ లా నేస్తం కింద 65,537 వేల మంది జూనియర్ న్యాయవాదులకు నిధులు
- కర్నూలులో 50 ఎకరాల స్థలంలో రెండో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం
- ఫిబ్రవరి 24న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపు
- ఫిబ్రవరి 28న జగనన్న విద్యాదీవెన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఉగాది సందర్భంగా మూడో విడత వైఎస్ఆర్ ఆసరా
- మార్చిలో ఈబీసీ నేస్తం, వసతి దీవెన
- కర్నూలు జిల్లా డోన్‌లో నూతనంగా నిర్మిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 31 మంది బోధన, 12 మంది బోధనేతర సిబ్బంది భర్తీ
- నందిగామలో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.34.48 కోట్ల వ్యయంతో 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్ గ్రేడ్, 52 పోస్టుల భర్తీ
- వైద్య విభాగంలో పోస్టుల భర్తీ కోసం మెడికల్ సర్వీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు
- ఫ్యామిలీ డాక్టర్ విధానం పటిష్టంగా అమలుకు ప్రతి పీహెచ్‌సీలో సిబ్బందిని 12 నుంచి 14 మందికి పెంపు, కొత్తగా 1,610 కొత్త పోస్టుల భర్తీ
- వైఎస్సార్ జిల్లా ఫాతిమా

- మిగతా 2 లో

- ఆ తర్వాతే ఏపీ సీఆర్‌డీఏ చట్టం ఏర్పాటు
- కేసు కోర్టులో ఉన్నందున వివరాలు చెప్పలేం
- పార్లమెంటు సాక్షిగా కేంద్రం స్పష్టీకరణ

అమరావతే రాజధాని

విభజన చట్టం ప్రకారమే నోటిపై చేశాం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ రాజధానిపై పార్లమెంట్ సాక్షిగా కేంద్రం కొంత స్పష్టత ఇచ్చింది. గతంలో రాజధాని విషయంలో తమకు సంబంధం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా పెట్టుకోవచ్చని తికమక సమాధానాలిచ్చిన కేంద్ర ప్రభుత్వం... మొట్టమొదటిసారిగా విజభన చట్టం ప్రకారమే అమరావతి ఏర్పాటైందని తేల్చిచెప్పింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి బుధవారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఏపీ విభజన చట్టంలోని సెక్షన్ 5, 6 ప్రకారం రాష్ట్ర రాజధాని ఏర్పాటుపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కమిటీ సూచనలు, సలహాలు, నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా, దాన్ని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి రాజధానిగా అమరావతినే ఎంపిక చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందని వెల్లడించారు. ఆ తర్వాతే ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజినల్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీసీఆర్‌డీఏ)ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఓ చట్టాన్ని తీసుకొచ్చినట్లుగా కేంద్ర హోం మంత్రిత్వశాఖ పార్లమెంటుకు వివరించింది. 2020లో ఏపీసీఆర్‌డీఏను రద్దుచేసినట్లుగా, మూడు రాజధానుల ప్రతిపాదనలు తీసుకొస్తున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త బిల్లు ప్రవేశపెట్టినట్లు మంత్రి వివరించారు.

అనంతరం ఆ బిల్లును మళ్లీ వెనక్కి తీసుకుంటూ ఏపీసీఆర్‌డీఏ చట్టాన్ని కొనసాగింపుగా మరో బిల్లు ముందుకు వచ్చినట్లుగా మంత్రి వివరించారు. రాజధాని అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందని కేంద్ర ప్రభుత్వం చెప్పిందా? అంటూ విజయసాయిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా అమరావతి రాజధాని అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిందని, ప్రస్తుతం కేసు కోర్టులో ఉన్నందున దీనికి సంబంధించి ఇంతకంటే చెప్పడానికి ఏమీ లేదని కేంద్రం స్పష్టం చేసింది. దీనిపై మాట్లాడటం కోర్టు ధిక్కరణ అవుతుందని పేర్కొంది. మొత్తానికి అమరావతిపై కేంద్ర చేసిన ప్రకటన గతంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించినట్లైంది. విభజన చట్టం ప్రకారమే అమరావతి ఏర్పడిందని... దాన్ని మార్చాలంటే మళ్లీ కేంద్రం జోక్యం చేసుకోవాల్సి ఉంటుందని, విభజన చట్టంలో మార్పులు చేసుకోవాల్సి ఉంటుందని హైకోర్టు చెప్పిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ తాజా ప్రకటన దీనికనుగుణంగా ఉండటం గమనార్హం.

ఆగని అదానీ ప్రకంపనలు

- ప్రజల సొమ్ముకు రక్షణేది?
- విపక్షాల వాయిదా తీర్మానాల తిరస్కరణ
- రాజ్యసభ నుంచి బీఆర్ఎస్, ఆప్, ఉద్ధవ్ వర్గం వాకౌట్

2లో

ఈడీ విచారణతోనే విపక్ష ఐక్యత

- ప్రతిపక్షాల ఆరోపణలకు బెదరను
- మారని తీరు- విమర్శలతోనే తొమ్మిదేళ్లు వృథా
- కాంగ్రెస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు: మోదీ

2లో

ఇదీ లోకం!

మావారు, గోడదూకాలనుకుంటున్నారు! అదే, పార్టీ మారాలనుకుంటున్నారు.!

ఏపీకి తీవ్ర నష్టం

ఎగువ భద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టు

- జాతీయ హోదా కల్పించిన కేంద్రం
- చోద్యం చూస్తున్న సీమ ప్రజాప్రతినిధులు
- నోరు విప్పని జగన్ ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు: తుంగభద్ర నదిపై కర్ణాటక ప్రభుత్వం అనేక ఎత్తిపోతల పథకాలు, లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టులు అనధికారికంగా నిర్మిస్తోంది. దీని వలన ఏపీకి ముఖ్యంగా రాయలసీమకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం ఏర్పడింది. భద్రా నదిపై నిర్మించిన లిఫ్టు ఇరిగేషన్‌కు ఈ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.5400 కోట్లు కేటాయించడమే కాకుండా దానికి జాతీయ హోదా కల్పించింది. ఈ ప్రాజెక్టును అనధికారికంగా నిర్మించినా రాష్ట్ర ఎంపీలు లోక్‌సభలో ఏమాత్రం అడ్డుకోకపోవడం దారుణం. కృష్ణా బేసిన్‌లో తుంగభద్ర నది ఉపనది. ఆంధ్ర, కర్ణాటక జల ప్రయోజనాల కోసం హోస్పేట వద్ద తుంగభద్ర నదిపై 1953లో 131.29 టీసీఎంసీల సామర్థ్యంతో తుంగభద్ర ప్రాజెక్టును కర్ణాటక ప్రభుత్వం నిర్మాణం చేపట్టింది. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ కలిపి 212 టీఎంసీల నీరు ఉపయోగించుకునేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఏపీ, తెలంగాణకు 73.01 టీఎంసీలు, కర్ణాటకకు 138.99 టీఎంసీల నికర జలాలు కేటాయించారు. అయితే ఏపీకి వచ్చే నీటిని ఆ రాష్ట్ర రైతులు అక్రమంగా వాడుకుంటున్నారు. ఏపీకి నీటిని రానివ్వడం లేదు. దీనిపై అనేకసార్లు ఏపీ రైతులు నిరసనలు తెలిపినా కర్ణాటక పట్టించుకోలేదు. తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడం సర్వసాధారణంగా మారింది. అయితే ఇటీవల తుంగభద్ర నదిపై కర్ణాటక ప్రభుత్వం అనధికారికంగా చేపట్టిన లిఫ్టుఇరిగేషన్ ప్రాజెక్టుల వలన ఏపీకి తీరని అన్యాయం జరిగే ప్రమాదం ఏర్పడింది. కర్ణాటకలోని చిక్‌మంగళూరు, చిత్రదుర్గ, దావణగెరె, తుముకూరు జిల్లాలలో 2.25 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా రూ.21,473 కోట్లతో మొదటి దశ కింద తుంగ నుండి భద్రకు 17.40 టీఎంసీలు, రెండోదశ కింద భద్ర నది నుండి 29 టీఎంసీల సామర్థ్యం గల ఎత్తిపోతల పథకాన్ని కర్ణాటక ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటికే దాదాపు మొదటి విడత పనులు పూర్తికాగా, రెండో దశ కింద చేపట్టిన పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం 2020లో కర్ణాటక ప్రభుత్వం అనుమతులు పొందింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏపీకి రావలసిన నీటి వాటాకు కోత పడే అవకాశం ఉంది. కర్ణాటక ప్రభుత్వం మూడేళ్ల క్రితం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి...వడివడిగా పనులు చేస్తున్నా...ఎన్నికల కోసం కేంద్రప్రభుత్వం దీనిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి....ఉత్తర్వులు మంజూరు చేసినా జగన్ ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ అధికారులు ఏమి చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు వలన ఏపీకి

- మిగతా 2 లో

అప్పులు, వడ్డీ చెల్లింపుపై శ్వేతపత్రం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అప్పులు, వడ్డీల చెల్లింపులపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ...ఆంధ్రప్రదేశ్ అప్పుల కుప్పగా మారిందని, 2019తో పోలిస్తే అప్పులు రెండింతలయ్యాయని రామకృష్ణ వివరించారు. రాష్ట్రం అప్పు రూ.4.42 లక్షల కోట్లకు చేరిందని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంట్‌లో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి...ఏపీ అప్పు కేవలం రూ.1.35 లక్షల కోట్లు మాత్రమేనని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ కార్పొరేషన్‌లు, తదితరాల ద్వారా చేసిన అప్పుతో కలిపి దాదాపు రూ.10లక్షల కోట్లు ఉంటుందని ఆర్థికవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఇన్ని అప్పులు చేస్తున్నా ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. పెన్షన్‌లు సక్రమంగా చెల్లించకపోవడంతో పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు, వడ్డీ చెల్లింపులపై నిజానిజాలు వెల్లడించాలని జగన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి 'అప్పుచేసి పప్పుకూడు' పాలన సాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి అటకెక్కిందనీ, నూతన పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు తరలిపోతున్నాయని ఆరోపించారు. వివిధ కార్పొరేషన్ల పేరుతో దాదాపు రూ.1.72 లక్షల కోట్లు అప్పులు తెచ్చారని,

- మిగతా 2 లో

మళ్లీ వడ్డీ రేట్లు పెరిగాయ్

- 25 బేసిస్ పాయింట్ల పెంపు
- 6.5 శాతానికి రెపోరేటు
- అదానీ వ్యవహారం సమస్య కాబోదు
- ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్

న్యూఢిల్లీ: దేశంలో ద్రవ్యోల్బణం అదుపు చేసే చర్యల్లో భాగంగా మరోసారి కీలక వడ్డీ పాయింట్లు పెంచుతున్నట్లు భారత రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) తెలిపింది. రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు వెల్లడించింది. దీంతో ప్రస్తుతం రెపో రేటు 6.5శాతానికి చేరినట్లయింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను బుధవారం ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. ఈ సందర్భంగా

- మిగతా 2 లో

ఎంఎస్ఎంఈలకు కష్టాలు

- 10,655 సంస్థల మూత
- నాలుగేళ్లలో ఇదే గరిష్ఠం
- కలిసిరాని 2022-23 వత్సరం

న్యూఢిల్లీ: లఘు, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ)లకు 2022-23 ఆర్థిక సంవత్సరం ఏ మాత్రం కలిసిరాలేదు. 10,655 ఎంఎస్ఎంఈలు మూతపడటంతో 2022-23 అత్యంత క్లిష్ట వత్సరంగా పరిణమించింది. నాలుగేళ్లలో ఇంతలా చిన్న సంస్థలు మూతపడలేదని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కొనసాగుతుండటంతో ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని కేంద్రప్రభుత్వం రాజ్యసభకు రాతపూర్వకంగా తెలిపింది. 2021-22లో మూతపడిన ఎంఎస్ఎంఈల సంఖ్య 6,222 కాగా 2020-21లో 175, 2019-20లో 400గా ఉన్నట్లు ప్రభుత్వ డేటా పేర్కొంది. కొత్త పరిశ్రమల ప్రారంభం, మూతపడిన పరిశ్రమల నిష్పత్తి క్రమంగా క్షీణించినట్లు వెల్లడించింది. 2020-21లో మూతబడిన ప్రతి 175 సంస్థల్లో ఒకదాని స్థానె 11వేల కొత్త సంస్థలు మొదలు కాగా 2021-22లో ప్రారంభించిన సంస్థల సంఖ్య 349కు తగ్గింది. అదే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంఖ్య 167కు దిగజారింది. దీంతో ఎంఎస్ఎంఈలపై ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ, కోవిడ్ లాక్‌డౌన్‌లతో చిన్న పరిశ్రమలు కుదేలయ్యాయని, నిరుద్యోగం తారస్థాయికి పెరిగిందని, ఆర్థిక

- మిగతా 2 లో

శవాల గుట్టలు

- 10వేలకు చేరిన భూకంప మృతులు
- టర్కీ, సిరియాలో కన్నీటిగాథలు
- భయానక పరిస్థితులు-హృదయవిదారక దృశ్యాలు
- సహాయక చర్యలకు ఆటంకంగా వాతావరణం
- సోమవారం నుంచి 300పైగా ప్రకంపనలు
- శిథిలాల నుంచి బయటపడుతున్న మృతదేహాలు

అంకారా/డమాస్కస్: భూకంపం మిగిల్చిన విషాదంతో టర్కీ, సిరియా దేశాలు శవాల దిబ్బల్లా మారాయి. అక్కడి వాతావరణంలో మృత్యువు ఘోషిస్తోంది. ఎటు చూసినా శవాలు, భవనాల శిథిలాలు, అర్తనాదాలతో భయానక దృశ్యం ఆవిష్కృతమైంది. శిథిలాల నుంచి బయటపడిన వారి కన్నీటిగాథలు హృదయాన్ని ద్రవింపజేస్తాయి. సోమవారం నుంచి 300 సార్లకుపైగా భూ ప్రకంపనలు సంభవించాయి. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు, వర్షం ఉండటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. సహాయక చర్యలకూ తీవ్ర ఆటంకం కలుగుతోంది. బుధవారానికి మృతుల సంఖ్య 10వేలకు చేరుకుంది. రెండు కోట్ల మంది బాధితులు ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. ప్రపంచ దేశాల చేయూతతో టర్కీ, సిరియా దేశాలు ఊపిరి పీల్చుకుంటున్నాయిగానీ ఇప్పుడప్పుడే కోలుకునే పరిస్థితి లేదు. నేలమట్టమైన వేలాది భవనాల శిథిలాల కింద నుంచి ఎవరైనా ప్రాణాలతో ఉన్నారేమోనని సహాయక బలగాలు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నాయి. దీంతో ప్రతిక్షణం విలువైనదిగా మారింది. అమల్యమైన ప్రాణాలను కాపాడేందుకు సమాయానికి ఎదురీదాల్సిన సమయం ఇదని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. సహాయక చర్యల్లో 25వేల మందికిపైగా పాల్గొన్నా సరిపోవడం లేదు. శిథిలాల కింద చిక్కుకున్న తమవారి కోసం స్థానికులు రోదిస్తుండటం కలిచివేస్తోంది. వారి హాహాకారాలతో అక్కడ పరిస్థితులు గుండెలను పిండేస్తున్నాయి. భూకంప బాధితుల కోసం సైన్యం తాత్కాలిక శిబిరాలను, క్షేత్రస్థాయి ఆసుపత్రులను ఏర్పాటు చేస్తోంది. షాపింగ్ మాల్స్, స్టేడియాలు, మసీదులు, సామాజిక భవనాల్లో ప్రజలు తలదాచుకుంటున్నారు. ఇస్కెర్డెరున్‌లో ఆసుపత్రి కూలిపోవడంతో భూకంప బాధితులకు వైద్యం కోసం నౌకాదళ నౌకను సమీపంలోని రేవుకు పంపించారు. రహదారులపై మంచు పేరుకుపోవడం, చలిగాలులకు అక్కడవారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. భూకంపం కారణంగా మొత్తం 23 మిలియన్ల మంది ప్రజలు ప్రభావితమయ్యారని, వారికి ఆపన్నహస్తాన్ని అందజేయడానికి అన్ని దేశాలూ ముందుకు రావాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ అభ్యర్థించింది. ఇటువంటి కష్టకాలంలో సిరియాపై ఉన్న ఆంక్షలను పశ్చిమ దేశాలు తొలగించి, మానవత్వంతో ముందుకురావాలని సిరియా రెడ్ క్రెసెంట్ కోరింది.

మూడు నెలలుపాటు ఎమర్జెన్సీ

టర్కీలో టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్ దేశంలోని పది ప్రావిన్సుల్లో మూడు నెలల పాటు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 119 ప్రకారం పది ప్రావిన్సుల్లో మూడునెలలు ఎమర్జెన్సీ విధించాం. శిథిలాల కింద చిక్కుకున్న మృతదేహాలను వెలికితీయడానికి సహాయక సిబ్బంది నిర్విరామంగా పనిచేస్తున్నారు' అని ఎర్డోగన్ అన్నారు. దాదాపు 40వేల మందికి గాయాలయ్యాయని చెప్పారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని మీడియా సమావేశంలో ఎర్డోగన్ వెల్లడించారు. భూకంప ప్రభావిత ప్రావిన్సులలో కహ్రమన్మరాస్, అదానా, అడియామాన్, ఉస్మానియే, హటే, కిలిస్, మలత్య, సాన్లియుర్ఫా, దియార్‌బాకిర్, గజియాంటెప్ ఉన్నాయని అధ్యక్షుడు తెలిపారు.

తమ్ముడు... నేనున్నా...

భూకంపం ధాటికి కుప్పకూలిన ఓ భవన శిథిలాల కింద ఓ బాలిక, తన తమ్ముడితో పాటు ఇరుక్కుపోయింది. స్లాబ్‌కు ఒకవైపు నేల, మరోవైపు పిల్లర్ సపోర్టుగా ఉండడంతో తమ్ముడి తలకు గాయం కాకుండా ఉండాలనే భావంతో గంటల తరబడి తన తన చేయిని అడ్డంపెట్టి రక్షించింది. నీకు నేనున్నాను.. నీకేం కాదని భరోసా కల్పించింది. ఈ ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది.

తెలుగు రాష్ట్రాల కార్మికుల కుటుంబాల్లో ఆందోళన

తెలుగు రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం టర్కీకి వెళ్లిన వందలాది మంది కార్మికులు తీవ్రస్థాయిలో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం, కవిటి, సోంపేట, కంచిలి, వజ్రపుకొత్తూరు, ఇచ్చాపురం నుంచి కార్మికులు వెళ్లినట్లు తెలుస్తోంది. వారి గురించి క్షేమసమాచారం అందక స్వస్థలాల్లో ఉన్న కుటుంబ సభ్యుల్లో ఆందోళన పెరిగింది.

కొందరు తాము క్షేమమని చెప్పడంతో కొందరు కుటుంబ సభ్యులు కాస్తంత ఉపశమనం పొందారు. సిరియా సరిహద్దుకు సుమారు 300 కి.మీ దూరంలో ఉన్న తుర్కియేలోని అదానా నగరానికి సమీపంలో ఉన్నామని శ్రీకాకుళం వాసులు కొందరు తమ కుటుంబాలకు క్షేమసమాచారాన్ని పంపారు.

విశాలాంధ్ర ప్రపంచం

మాది ఆత్మీయబంధం

జెలెన్‌స్కీ బ్రిటన్ పర్యటనపై రిషిసునక్

లండన్: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్‌స్కీ బుధవారం బ్రిటన్ చేరుకున్నారు. జెలెన్‌స్కీ తమ దేశంలో పర్యటించడం బ్రిటన్‌కు ఉక్రెయిన్‌కు మధ్య ఉన్న ఆత్మీయ బంధాన్ని ప్రతిబింబింపజేస్తుందని బ్రిటన్ ప్రధాని రిషిసునక్ అన్నారు. ఉక్రెయిన్‌కు తమ మద్దతు ఎల్లప్పుడు ఉంటుందని హామీనిచ్చారు. ఆ దేశ సైనికులకు అవసరమైన శిక్షణను తమ దేశంలో ఇవ్వడానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. అయితే రష్యాతో యుద్ధం మొదలైన తర్వాత జెలెన్‌స్కీ మొదటిసారి బ్రిటన్‌లో పర్యటించారు. అయితే ఇది ఆయన రెండవ విదేశీయానం. గతేడాది డిసెంబరులో ఆయన అమెరికాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన బ్రిటన్ ప్రధాని రిషిసునాక్‌తో చర్చలు నిర్వహించి, పార్లమెంటులో ప్రసంగిస్తారు. బ్రిటన్ సైన్యాధికారులతోనూ భేటీ అవుతారు. రష్యాతో ఏడాదిగా జరుగుతున్న యుద్ధం క్రమంలో ఉక్రెయిన్‌కు బ్రిటన్ వెన్నుదన్నుగా నిలిచింది. 2.5 బిలియన్ డాలర్లకుపైగా విలువచేసే ఆయుధాలు, పరికరాలను అందించింది. ఉక్రెయిన్ పైలెట్లకు నాటో స్టాండర్డ్ ఫైటర్ జెట్లతో శిక్షణ ఇస్తోంది. 10వేల మందికిపైగా ఉక్రెయిన్ దళాలు ఇప్పటికే బ్రిటన్ శిబిరాల్లో శిక్షణ పొందాయి. ఛాలంజర్ 2 ట్యాంకులనూ బ్రిటన్ పంపింది. జెలెన్‌స్కీ పర్యటన ఆ దేశ ధైర్యాన్ని, పోరాటస్ఫూర్తి, బ్రిటన్‌తో ఆత్మీయ బంధానికి అద్దంపట్టినట్లు రిషి సునక్ పేర్కొన్నారు. 2014 నుంచి సార్వభౌమాధికారాన్ని కాపాడుకునేలా ఆ దేశ దళాలకు బ్రిటన్‌లో కీలకశిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్ సైనికులు, మెరైనర్లు, పైలట్లకు శిక్షణ ఇస్తుండటం సంతోషంగా ఉందన్నారు. తాత్కాలికంగా సైనిక సామగ్రి ఇవ్వడమే కాకుండా.. ఆ దేశంతో దీర్ఘకాలం కలిసి ఉంటామని ఆయన చెప్పారు. బ్రిటన్ పూర్వ ప్రధాని బోరిస్ జాన్సన్‌తోనూ జెలెన్‌స్కీకి సత్సంబంధాలు ఉండటం విదితమే.

కేసీఎన్ఏ... ప్రపంచంలోనే శక్తిమంతం : కిమ్

సియోల్: తమ దేశ సాయుధ దళాల 75వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తర కొరియా అధినేత కిమ్‌జాంగ్ ఉన్ తన కుమార్తెతో కలిసి జనరల్ స్థాయి అధికారుల బరాక్‌లను సందర్శించారు. ఈ మేరకు ప్యాంగ్యాంగ్ మీడియా బుధవారం పేర్కొంది. కిమ్ కొంతకాలంగా అదృశ్యమైనట్లు ఊహాగానాల వేళ కిమ్ సందర్శనకు ప్రాధాన్యత ఏర్పడింది. కొరియన్ పీపుల్స్ ఆర్మీ (కేపీఏ)ను ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దళంగా కిమ్ శ్లాఘించినట్లు కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) నివేదించింది. శాంతి, సుస్థిరత, అభివృద్ధి కోసం అనేక బాధలు అనుభవిస్తూ ఎన్నో ఒడిదుడుకులను అధిగమిస్తూ అత్యద్భుత శక్తిగా ఆవిర్భవించాం' అని అణ్వాయుధ శక్తిని కలిగివుండటాన్ని ఉద్దేశిస్తూ కిమ్ అన్నారు. మీడియా విడుదల చేసిన ఫొటోల్లో కుటుంబ సమేతంగా కార్యక్రమానికి కిమ్ హాజరైనట్లుగా కనిపిస్తోంది. సైన్యాధికారులతో పాటు భార్య, కుమార్తెతో కలిసి కిమ్ విందులో పాల్గొన్న ఫొటోను యోన్హాప్ వార్తాసంస్థ వెలువరించింది. కిమ్ తన కుమార్తె జు-యేని గతేడాది నవంబరులో ప్రపంచానికి పరిచయం చేశారు.

నేటి నుంచి విజయవాడ పుస్తకమహోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ: ముప్పై మూడవ విజయవాడ పుస్తక మహోత్సవం ఫిబ్రవరి 9 నుంచి 19వ తేదీ వరకు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో జరుగుతుంది. గురువారం సాయంత్రం 6 గంటలకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తారు. రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభోపన్యాసం చేస్తారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అధికార భాషాసంఘం చైర్మన్ విజయబాబు, సాక్షి దినపత్రిక ఎడిటర్ వి.మురళి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, సాంకేతిక విద్యాశాఖ అధికారి నాగరాణి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి గౌరవ అతిథులుగా పాల్గొంటారు. 7.30 గంటలకు సాహిత్య సంబరాల ప్రారంభ సభ జరుగుతుంది. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.జవహర్‌రెడ్డి ప్రారంభిస్తారు. తెలుగు సాంస్కృతిక అకాడమీ అధ్యక్షులు లక్ష్మీపార్వతి, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి తదితరులు పాల్గొంటారు. పుస్తక మహోత్సవం ప్రతిరోజు మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8.30 గంటల వరకు జరుగుతుంది.

ఈడీ విచారణతోనే విపక్ష ఐక్యత

లోక్‌సభలో మోదీ విమర్శలు

న్యూఢిల్లీ: కోట్లాది మంది ప్రజల నమ్మకమే తన రక్షణ కవచమని ప్రధాని మోదీ అన్నారు. తన రక్షణ కవచాన్ని ఛేదించే శక్తి విపక్షాల అభియోగాలు, ఆరోపణలకు లేదన్నారు. 22 ఏళ్లుగా విపక్షాలు తనను విమర్శిస్తున్నాయని, వాస్తవాలను గ్రహించడం లేదని, ఈడీ దర్యాప్తుల వల్ల విపక్షాలు ఏకమయ్యాయని మోదీ అన్నారు. తనను విమర్శించడమే కొందరి అభిమతమన్నారు. తొమ్మిదేళ్లను విమర్శలతోనే విపక్షాలు వృథా చేశాయని ఎద్దేవా చేశారు. యూపీఏ పదేళ్ల పాలన కుంభకోణాలమయని విమర్శించారు. ఒక్క హార్వర్డే కాదు అన్ని ప్రముఖ విశ్వవిద్యాలయాలు కాంగ్రెస్ పతనంపై అధ్యయనాలు చేస్తాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఎదురుదాడి చేశారు. యూపీఏ హయంలో దళితులు, అణగారిన వర్గాలు, గిరిజనులు, మధ్యతరగతి ప్రజల సంక్షేమం అటకెక్కిందని, తమ ప్రభుత్వ పథకాలు ఆయా వర్గాలకు ప్రయోజనాలు అందిస్తున్నాయని గొప్పలు పోయారు. కశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని వేడుక చేసుకుంటున్నారని, అక్కడి ప్రతి ఇంటిపై జాతీయ జెండా (హర్ ఘర్ తిరంగా) ఎగిరిందన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, 2047 నాటికి భారత్ నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని మోదీ అన్నారు. ప్రధాని బుధవారం లోక్‌సభలో మాట్లాడుతూ రాష్ట్రపతి ప్రసంగాన్ని మార్గనిర్దేశనం చేసేదిగా ఉన్నదని కొనియాడారు. రాష్ట్రపతి ప్రసంగంపై ఎవరూ అభ్యంతరాలు వ్యక్తంచేయలేదని, ఎవరికి ఎలాంటి సందేహాలు రాలేదన్నారు. తమ పాలన గురించి ప్రగల్భాలు పలుకుతూ కేంద్రప్రభుత్వ పథకాలను, ఒక దేశం.. ఒక రేషన్ కార్డ్ కింద నిరుపేదలకు ఆహార ధాన్యాలు ఇవ్వడం, కోవిన్ ద్వారా వాక్సిన్ పత్రాల పంపిణీ, కోట్లాది మందికి ఉచిత వ్యాక్సిన్ తదితర అనేక అంశాలను గొప్పగా చెప్పుకున్నారు. తమ వల్ల గొప్ప అభివృద్ధి జరిగిందని, మహిళలకు అనేక అవకాశాలు లభించాయని సొంత డబ్బా కొట్టుకున్నారు. కష్టకాలంలో మోదీ సాయం చేశాడని ప్రజలకు తెలుసు... మీ ఆరోపణలకు వారు ప్రభావితం కాబోరని మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించారు. చర్చలు ప్రజాస్వామ్య బలోపేతానికి ముఖ్యమని, వాటిని శుద్ధ యజ్ఞం' అని అన్నారు. జేపీసీ కావాలని ప్రతిపక్షాలు అంటారని ఎద్దేవా చేశారు. యూపీఏ హయంలో దేశంలోని ప్రతిమూల అనుమాన వస్తువులను తాకరాదన్న హెచ్చరికలు ఉండేవని అన్నారు. ఎన్నికల్లో ఓడిపోతే ఈసీని దూషిస్తారు లేక ఈవీఎంలలో లోపాలని అంటారని విపక్షాలను విమర్శించారు. తమకు అనుకూలంగా లేకపోతే కోర్టులు తీర్పులనూ తప్పుపడతారన్నారు. భారత్‌లో సుస్థిరత, నిర్ణయాత్మక ప్రభుత్వం ఉందని, దేశ ప్రయోజనాల దృష్ట్యా సమర్థ సుపరిపాలన అందిస్తోందని మోదీ గొప్పలు పోయారు. మహమ్మారిని కట్టడి చేయడంతో దేశ ప్రతిష్ట పెరిగిందన్నారు. టీవీలో కనిపించేది చూసి లేక వార్తాపత్రికల్లో శీర్షికలు చదివి ప్రజలు మోదీని నమ్మడం లేదని, ఆయన నిబద్ధతకు మెచ్చి నమ్ముతున్నారని తన భుజాన్ని తాన్నే తట్టుకున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు దేశానికి చేటు చేశాయని, తద్వారా అభివృద్ధి నత్తనడకన సాగిందని, మధ్యతరగతి వర్గం నిర్లక్ష్యానికి గురైందని మోదీ అన్నారు. తమ ప్రభుత్వ పథకాల వల్ల మధ్యతరగతి ఎంతో మేలు జరిగిందన్నారు. విద్యుత్ వినియోగంలో భారత్ మూడవస్థానంలో ఉందని, తొమ్మిదేళ్లలో 90వేల స్టార్టప్‌లు ప్రారంభమయ్యాయని, గడియారాల తయారీకి ప్రపంచ హబ్‌గా భారత్ ఆవిర్భవిస్తోందని మోదీ చెప్పారు. భారతదేశ డిజిటల్ పురోగతి ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోందని, బాలీలో దీనిని స్వయంగా అనుభవించానన్నారు. ఇదిలావుంటే మోదీ ప్రసంగానికి ముందు సభా కార్యకలాపాలను బీఆర్ఎస్ సభ్యులు బహిష్కరించారు. లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు. మోదీ మాట్లాడే సమయంలో అధికార-విపక్షాలు పోటీ పడి నినాదాలు చేశారు. అధికార పక్ష సభ్యులు 'మోదీ...మోదీ' అంటే విపక్ష సభ్యులు 'అదానీ.. అదానీ' అని నినదించారు.

ఆగని అదానీ ప్రకంపనలు

రాజ్యసభ నుంచి బీఆర్ఎస్, ఆప్, ఉద్ధవ్ వర్గం వాకౌట్

న్యూఢిల్లీ: పార్లమెంటులో 'అదానీ' ప్రకంపనలు కొనసాగుతున్నాయి. అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదిక చేసిన ఆరోపణలపై దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్షాలు బుధవారం డిమాండ్ చేశాయి. అదానీ గ్రూప్ షేర్ల విలువ పతనమవడం అతి పెద్ద కుంభకోణమని మండిపడ్డాయి. ప్రభుత్వ రంగంలోని ఎల్ఐసీ, ఎస్‌బీఐ ఈ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టినందువల్ల ఇది సామాన్యుల సొమ్ముకు సంబంధించిన విషయమని స్పష్టంచేశాయి. అదానీ గ్రూప్‌పై తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని ప్రభుత్వాన్ని ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ, శివసేన ఠాక్రే వర్గం, బీఆర్ఎస్ వాయిదా తీర్మానాలు ఇచ్చాయి. రూల్ 267 ప్రకారం కె.కేశవరావు (బీఆర్ఎస్), సంజయ్‌సింగ్ (ఆప్), శివసేన ఠాక్రే వర్గం సభ్యులు సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది ఇచ్చిన నోటీసులను అనుమతించడం లేదని చైర్మన్ జగదీప్ ధన్కర్ ప్రకటించారు. దీంతో ఈ పార్టీల సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. కాంగ్రెస్ ఎంపీ మల్లికార్జున ఖర్గే రాజ్యసభలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సభలో ఎక్కువ సమయం గడపాలని కోరారు. మోదీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించవలసిన మంత్రులు, ఎంపీలు హిందూ-ముస్లిం అంటూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దేవాలయాల్లోకి ప్రవేశించే ఎస్సీలను కొడుతున్నారని ఖర్గే ఆరోపించారు. వారిని హిందువులుగా పరిగణిస్తే, దేవాలయాల్లోకి ఎందుకు ప్రవేశించనివ్వడం లేదని నిలదీశారు. చదువుకోవడానికి ఎస్సీలకు ఎందుకు అవకాశం ఇవ్వడం లేదన్నారు. ఎస్సీల ఇళ్లలో భోజనం చేస్తున్నట్లు కనిపించే ఫొటోలను చాలామంది మంత్రులు చూపిస్తున్నారని హేళన చేశారు. కేంద్ర ప్రభుత్వం చెప్పిన దానినే రాష్ట్రపతి, గవర్నర్లు పునరుద్ఘాటించడం తరచూ జరుగుతోందని, అయితే, ఈసారి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మైనారిటీల గురించి మాట్లాడతారని ఆశించానని, కానీ తనకు నిరాశే మిగిలిందని వ్యాఖ్యానించారు. నిజం మాట్లాడితే తాను జాతి వ్యతిరేకిని అవుతానా? అని ఖర్గే నిలదీశారు. తాను దేశ వ్యతిరేకిని కాదని, ఇక్కడ ఉన్నవారిలో ఎవరితో పోల్చుకున్నా తాను గొప్ప దేశభక్తుడినని చెప్పారు. తాను భూమి పుత్రుడినని ఖర్గే పేర్కొన్నారు. మీరు దేశాన్ని దోచుకుంటూ...తనను దేశ వ్యతిరేకి అంటున్నారని మండిపడ్డారు.

ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ మాట్లాడుతూ మోదీపై పదే పదే వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ ధన్కర్ మాట్లాడుతూ దేశానికి మనం చెడు సందేశం పంపిస్తున్నామని ఆందోళన వెలిబుచ్చారు. వ్యూహాత్మకంగానే ఈ విధంగా చేస్తున్నారన్నట్లు చెప్పారు. రాజ్యసభ ప్రారంభం కాగానే అదానీ గ్రూప్ అంశాన్ని ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తడంతో గందరగోళం ఏర్పడింది.

రాహుల్‌పై సభా హక్కుల తీర్మానం

కాంగ్రెస్ సభ్యుడు రాహుల్‌గాంధీపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషీ లోక్‌సభలో బుధవారం సభా హక్కుల తీర్మానం ప్రతిపాదించారు. పార్లమెంటు నిబంధనల ప్రకారం ఓ ఎంపీ ముందుగా నోటీసు ఇవ్వకుండా ఎటువంటి ఆరోపణలు చేయరాదన్నారు. ఓ కాంగ్రెస్ నేత (రాహుల్ గాంధీ) మంగళవారం నిరాధార ఆరోపణలు చేశారన్నారు. ఆయన మాటలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ నిసికాంత్ దుబే కూడా రాహుల్ గాంధీపై సభా హక్కుల తీర్మానం ప్రతిపాదించారు. సభలో లేని వ్యక్తిపై ఆరోపణలు చేయరాదన్నారు. సభలో లేని వ్యక్తి తనను తాను సమర్థించుకోవడం సాధ్యం కాదని, అందువల్ల ఆ వ్యక్తిపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని చెప్పారు. ముందుగా నోటీసు ఇచ్చి, స్పీకర్ అనుమతి పొందాలన్నారు. బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాకు, అదానీకి సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. భారత దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతూ ఉంటే ప్రతిపక్షాలు ఎందుకు ఆందోళన చెందుతున్నాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అదానీ ప్రాజెక్టుల గురించి వివరించారు. రక్షణ దళాల్లో నియామకాల కోసం అమలు చేస్తున్న అగ్నివీర్ పథకంపై ముందుగానే సంప్రదింపులు జరిపినట్లు తెలిపారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ త్రివర్ణ పతాకం నుంచి ఆకుపచ్చ రంగును మోదీ ప్రభుత్వం తొలగిస్తుందా? అని ప్రశ్నించారు. ఆకుపచ్చ రంగుతో మోదీ ప్రభుత్వానికి అన్ని సమస్యలు ఎందుకని ప్రశ్నించారు.

శ్వేతపత్రం

(మొదటిపేజీ తరువాయి)

మూడున్నరేళ్లుగా పెండింగ్ బిల్లులు రూ.లక్షా 50వేల కోట్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. నాన్ గ్యారంటీ రుణాలు మరో రూ.88 వేల కోట్లకు పైగా ఉన్నాయని, కార్పొరేషన్ల రుణ వివరాలు తెలపాలని కాగ్ పదేపదే అడిగినప్పటికీ జగన్ సర్కార్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జగన్ సర్కార్ బడ్జెట్‌లో పొందుపరచిన అప్పుల కంటే బడ్జెటేతర అప్పులు ఎక్కువ చేయడం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం ఇప్పటికే రాష్ట్ర రుణ పరిమితి దాటిపోవడం ప్రమాదకర సంకేతమని, అందినకాడికి అప్పులు చేయడం, కేంద్రం విధించే విషమ షరతులకు తలొగ్గి ప్రజలపై భారం వేయడమే పనిగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని దివాలా దిశగా నడిపిస్తున్నారని పేర్కొన్నారు.

ఏపీకి తీవ్ర నష్టం

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యంగా రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. తుంగభద్ర నదిపై కర్ణాటక ఇంకా అనేక అనధికార ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై రాయలసీమ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు నోరు తెరవకపోవడం దారుణం. ఇదే పరిస్థితి కొనసాగితే రాయలసీమ ఎడారిగా మారుతుంది. ప్రజలు సాగు, తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. రానున్న రోజుల్లో రాయలసీమ ప్రజలు జలోద్యమం చేపట్టే పరిస్థితులను పాలకులు కల్పించడం దురదృష్టకరం.

ఎంఎస్ఎంఈలకు కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థ ప్రమాదంలో పడిందని అన్నారు. గణాంక నిపుణుడు ప్రణబ్ సేన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఎంఎస్ఎంఈ రంగం పరిస్థితి గురించి మాట్లాడారు. ఈ రంగం ఆర్థిక వ్యవస్థకు 30శాతం, ఉపాధికి 40శాతం తోడ్పాటు అందిస్తుందని చెప్పారు. తాజా పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, ఎంఎస్ఎంఈ సమస్యకు సత్వర పరిష్కారం అవశ్యమని నొక్కిచెప్పారు. మహమ్మారి కాలంలో మూతపడిన 20 శాతం స్థానంలో కొత్త ఎంఎస్ఎంఈలను ప్రారంభించడం ఎంతో అవసరమని సేన్ సూచించారు.

ఆర్టీసీ కండక్టర్లకు సమాన వేతనంపై హర్షం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీఎస్ఆర్టీసీలో ఉద్యోగాలు పొంది వివిధ కారణాలతో క్రమబద్ధీకరణ ఆగిపోయిన 13 మంది కండక్టర్లు, 22 మంది డ్రైవర్లకు క్రమబద్ధీకరణ అయిన వారితో సమాన వేతనం అమలుకు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలివ్వడం పట్ల ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ హర్షం తెలిపింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వైవీరావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, చీఫ్ వైస్ ప్రెసిడెంటు పి.సుబ్రహ్మణ్యం రాజు, ఉపప్రధానకార్యదర్శి జీవీ నరసయ్య హర్షం తెలిపారు.

అదానీకి అప్పగింతలు

(మొదటిపేజీ తరువాయి)

ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో 2015-16 విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్

- 1998 డీఎస్సీలో క్వాలిఫైడ్ అభ్యర్థులతో 4,534 సెకండరీ గ్రేడ్ టీచర్ల పోస్టుల భర్తీ
- సబ్జెక్టు టీచర్లుగా అర్హత పొందిన 5,809 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు నెలకు రూ.2500 చొప్పున సబ్జెక్ట్ టీచర్ అలవెన్స్
- కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల బోధనా సిబ్బందికి గౌరవ వేతనానికి అదనంగా 23 శాతం పెంపు
- విశాఖపట్నంలో 100 మెగావాట్ల డేటా సెంటర్, ఐటీ అండ్ బిజినెస్ పార్కు, స్కిల్ సెంటర్‌తో పాటు రిక్రియేషన్ సెంటర్ల ఏర్పాటు కోసం అవసరమైన 60.29 ఎకరాల భూమి వైజాగ్ టెక్ పార్కు లిమిటెడ్ (వీటీపీఎల్)కు కేటాయింపు
- ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ కమిషన్‌లో 29 అదనపు పోస్టులు
- ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీస్ యాక్టు-1965, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్స్ యాక్టు 1955 సవరణల డ్రాఫ్ట్ బిల్లుకు ఆమోదం
- నెల్లూరు బ్యారేజ్‌ను నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి నెల్లూరు బ్యారేజ్‌గా మార్పు
- మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి రుణ సదుపాయం కోసం రూ.3,940.42 కోట్ల బ్యాంకు గ్యారంటీకి ఆమోదం
- రామాయపట్నం పోర్టులో రెండు క్యాప్టివ్ బెర్తుల నిర్మాణానికి జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు 250 ఎకరాల భూమి లీజు
- విజయనగరంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు
- మావోయిస్టులపై నిషేధాన్ని మరో ఏడాది పొడిగింపు
- పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంను రెవెన్యూ డివిజన్‌గా మార్పు, కొత్త పోలీస్ సబ్‌డివిజన్ ఏర్పాటు
- ఎన్టీఆర్ జిల్లాలో వీరులపాడు మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మార్పు

మళ్లీ వడ్డీ రేట్లు పెరిగాయ్

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ... పరపతి విధాన సమీక్షలో వడ్డీరేట్ల పెంపునకే సభ్యులు మద్దతు ఇచ్చారని తెలిపారు. 4-2 తేడాతో వడ్డీ రేట్ల పెంపును ఆమోదించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఆర్బీఐ ద్వైమాసిక పరపతి విధాన సమీక్షా సమావేశం మొదలైంది. మూడేళ్ల నుంచి ప్రపంచవ్యాప్తం గా అనిశ్చి తితో కూడిన పరిస్థితులు ఉన్నాయని దాస్ వ్యాఖ్యానించారు. ఫలితంగా ద్రవ్య పరపతి విధాన విషయంలో సవాళ్లు ఎదురయ్యాయని చెప్పారు. ఆర్థిక వ్యవహారాలు, ద్రవ్యో ల్బణాన్ని సమన్వయం చేసుకునేం దుకు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నట్లు తెలిపారు. అయితే ప్రస్తుత పరిస్థితులు నిరాశాజనకంగా ఏమీ లేవని అన్నారు. ద్రవ్యోల్బణం దిగొస్తోందని, భారత ఆర్థికవ్యవస్థ బలంగానే ఉందన్నారు. అయితే ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ పడిపోవడం దేశ ఆర్థిక వృద్ధికి విఘాతం కలిగించవచ్చన్నారు. గత డిసెంబర్‌లో ఆర్బీఐ వడ్డీ రేట్లను 35 బేసిస్ పాయింట్ల మేర పెంచగా.. అంతకుముందు వరుసగా మూడు సార్లు 50 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. అంతకుముందు 40 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. ఇప్పుడు 25 బేసిస్ పాయింట్లు కలుపుకొని మొత్తం గతేడాది మే నుంచి చూస్తే ఏకంగా 250 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును పెంచడం గమనార్హం. దీంతో మొత్తం రెపో రేటు ఏకంగా 6.50 శాతానికి చేరింది.

రుణాలు మరింత భారం...పెరగనున్న ఈఎంఐలు

ఆర్బీఐ రెపో రేటును పెంచిన నేపథ్యంలో ఆయా బ్యాంకులు నేరుగా ఈ ప్రభావాన్ని కస్టమర్లకు బదిలీ చేస్తాయి. రెపో రేటు అంటే... ఆర్‌బీఐ బ్యాంకులకు ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ. దీంతో బ్యాంకులకు ఇకపై ఆర్బీఐ కి ఎక్కువ వడ్డీ కట్టాల్సి ఉంటుంది. దీంతో ఆర్‌బీఐ వడ్డీ రేట్లు పెంచగానే బ్యాంకులు అన్ని రకాల రిటైల్ రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతాయి. దీంతో వ్యక్తిగత, గృహ, వాహన రుణాలు వంటివి మరింత భారం కానున్నాయి. ఇది సామాన్యులపై ఎక్కువ ప్రభావం చూపుతుంది. నెలవారీ ఈఎంఐలు పెరుగుతాయి.

నిలకడగానే మన బ్యాంకింగ్ వ్యవస్థ

భారత బ్యాంకింగ్ వ్యవస్థపై శక్తికాంత దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్యాంకులు సహా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు నిలకడగా కొనసాగుతున్నాయని, ఇంకా బలోపేతంగా తయారవుతున్నాయని వ్యాఖ్యానించారు. అవి సంక్షోభం అంచున ఉన్న అదానీ గ్రూప్‌కు ఇచ్చిన రుణాల గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన పని లేదని, అది పెద్ద సమస్యేం కాదన్నారు దాస్. బ్యాంకుల బలోపేతానికి సంబంధించి ఆర్బీఐ గత మూడు, నాలుగేళ్లుగా ఎన్నో చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇంకా బ్యాంకుల నిర్వహణకు సంబంధించి తాము కచ్చితమైన మార్గదర్శకాలన్నీ పాటిస్తామని, ఆడిట్ కమిటీలపైనా మార్గదర్శకాలుంటాయని దాస్ చెప్పారు. ఇంకా బ్యాంకులకు సంబంధించి.. చీఫ్ రిస్క్ ఆఫీసర్ల నియామకాలను కూడా తప్పనిసరి చేసినట్లు గుర్తుచేశారు. మరోవైపు అదానీ పేరును ప్రస్తావించకుండానే, కార్పొరేట్లకు బ్యాంకుల రుణాలపై విలేకరుల ప్రశ్నకు బదులిచ్చారు దాస్. బ్యాంకులు కార్పొరేట్ల కంపెనీల మార్కెట్ విలువను బట్టి రుణాలు ఇవ్వవని, ఆ కంపెనీ బలం, నగదు ప్రవాహాన్ని బట్టి లోన్లు ఇస్తాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల హిండెన్‌బర్గ్.. అదానీ గ్రూప్‌పై సంచలన విషయాలు బయటపెట్టింది. అదానీ గ్రూప్.. భారత స్టాక్ మార్కెట్లో అవకతవకలకు పాల్పడుతోందని, అకౌంటింగ్ మోసాలకు పాల్పడుతోందని ఆరోపించింది. రెండేళ్లకుపైగా పరిశోధన చేసి రిపోర్ట్ విడుదల చేసింది. దీంతో అదానీ కంపెనీల స్టాక్స్ కుప్పకూలాయి. దాదాపు అన్నీ సగానికిపైగా కుదేలయ్యాయి. అదానీ వ్యక్తిగత సంపద కూడా సగానికిపైగా పడిపోయింది. ఈ నేపథ్యంలో అదానీకి బ్యాంకులు ఇచ్చిన అప్పులు, ప్రభుత్వ సంస్థ ఎల్ఐసీ పెట్టుబడుల విషయంపై ఆందోళన నెలకొంది.

క్యూఆర్ కోడ్ ఆధారిత కాయిన్ వెండింగ్ మిషన్

వివిధ రకాల సేవలను కస్టమర్లకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు శక్తికాంత దాస్ తెలిపారు. అందులో భాగంగా దేశంలోని 12 నగరాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద క్యూఆర్ కోడ్ ఆధారిత కాయిన్ వెండింగ్ మిషన్‌ను ఆర్బీఐ ప్రారంభించనుంది. కస్టమర్ల ఖాతా నుంచి డబ్బులు డెబిట్ చేసుకుని ఈ వెండింగ్ మిషన్లు కాయిన్స్ అందిస్తాయి. బ్యాంకు నోట్లు లేకుండానే యూపీఐ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఈ వెండింగ్ మిషన్ల నుంచి చిల్లర నాణేలు తీసుకోవచ్చు. పైలట్ ప్రాజెక్టు ద్వారా తెలిసిన విషయాల ఆధారంగా బ్యాంకులకు మార్గదర్శకాలు జారీ చేసి ఈ వెండింగ్ మిషన్లతో చిల్లర నాణేలు పొందేలా ప్రచారం కల్పించాలని సూచిస్తామని దాస్ తెలిపారు. ఇక భారత్‌లోకి వచ్చే పర్యాటకులు సైతం యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా రిటైల్ చెల్లింపులు చేసే విధంగా సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు దాస్ వెల్లడించారు. ప్రస్తుతానికి జీ-20 దేశాలకు చెందిన ప్రయాణికులు ఎంపిక చేసిన విమానాశ్రయాలకు వచ్చినప్పుడు వారికి యూపీఐ సేవలను అందిస్తారు. త్వరలోనే ఇతర ఎయిర్‌పోర్టులకు సైతం విస్తరిస్తారు.

అవసరమైతే మళ్లీ సమ్మె

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు
- ఆర్డేడీ కార్యాలయాల ముట్టడి విజయవంతం
- గుంటూరు, అనంతపురం, రాజమహేంద్రవరంలో మున్సిపల్ కార్మికుల నిరసన

విశాలాంధ్ర-గుంటూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం అర్జేడీ కార్యాలయాలను మున్సిపల్ కార్మికులు ముట్టడించారు. గుంటూరు ఆర్జేడీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ... కార్మికుల సమస్యల్ని పరిష్కరించని పక్షంలో ఇతర కార్మిక సంఘాలను కలుపుకుని త్వరలో జరుగబోయే అసెంబ్లీ సమావేశాల సమయంలో పెద్దఎత్తున ఆందోళనలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. అవసరమైతే మళ్లీ సమ్మెలోకి వెళతామని స్పష్టం చేశారు. గత సమ్మె కాలంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందన్నారు. సమ్మె ముగిసి ఎనిమిది మాసాలు అవుతున్నా నేటికి ఏ ఒక్క హామీ అమలు కాలేదని, దీంతో మున్సిపల్ యూనియన్ నిరసనలకు పిలుపునిచ్చిందని చెప్పారు. అయితే యూనియన్ ఆధ్వర్యంలో ముందుగానే నోటీసు ఇచ్చినప్పటికి నిన్నటి వరకు స్పందించని అధికారులు నేడు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో మున్సిపల్, ఏఐటీయూసీ నాయకులను గృహ నిర్బంధాలు చేయడం దుర్మార్గమన్నారు. క్లాప్ డ్రైవర్‌లను పర్మినెంట్ చేయకుండా మూలనపడిన వాహనాలకు రూ.55 వేలు చొప్పున వైసీపీ కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని, పారిశుద్ధ్య కార్మికులతో పాటు ఇంజనీరింగ్ కార్మికులకు కూడా రూ.21 వేలు వేతనం ఇవ్వాలని, ప్రతి నెల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట మాల్యాద్రి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బందెల రవికుమార్, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, భాస్కర్, రమేష్, బాలయ్య, వెంకటేశ్వర్లు, విజయ్, బుజ్జి, నారాయణ, శివయ్య, మాలింబి, లక్ష్మీ, చెంచమ్మ, సాంబయ్య పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు: పోరుమామిళ్ల

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఆర్జేడీ కార్యాలయాన్ని మున్సిపల్ కార్మికులు ముట్టడించారు. ఈ నిరసన కార్యక్రమానికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరవగా, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ గౌడ్ అధ్యక్షత వహించారు. సుబ్బరాయుడు మాట్లాడుతూ... ఫీల్డ్ మీద తిరిగే మున్సిపల్ కార్మికులకు ముఖ హాజరు పట్టిక వేసే పద్ధతి సాధ్యంకాదని జీతాలకు భద్రత లేకుండా పోతుందని కార్మికులు వాపోతుంటే ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కడప,రాయచోటి, మదనపల్లె, డోన్,అనంతపురం తదితర జిల్లాల్లో ముఖ హాజరు విధానంపై అభ్యంతరం తెలిపిన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులను ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఉద్యోగ, కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ. ధోరణిని నిరూపించుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం అరెస్టులకు బెదరకుండా పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరై అనంతపురంలో ఆర్డీ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి మున్సిపల్ వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మరో ముఖ్య అతిథి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ... కార్మికుల సమస్యలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయని వాటిని పరిష్కరించడంలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. అనంతరం మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ వీవీఎస్ మూర్తికి వినతి పత్రం అందజేశారు. అంతకుముందు నగరంలోని మున్సిపల్ అతిథి గృహం నుండి ఆర్డీ కార్యాలయం వరకు కార్మికులు భారీ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యక్షులు గోవిందు, రాజు, మున్సిపల్ యూనియన్ కర్నూలు జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, అన్నమయ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, సురేష్, కడప జిల్లా నాయకులు రూబెన్, ప్రమీల, చిత్తూరు జిల్లా నాయకులు రామచంద్రయ్య, గోపీనాథ్, అనంతపురం జిల్లా నాయకులు రమేష్, హరికృష్ణ, కృష్ణనాయక్, వేణు, నాగేంద్ర బాబు, కొండయ్య, నాగరాజు, తిరుమలయ్య, దేవి, సుజాత పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ రద్దు చేసేవరకు ఉద్యమం: రావులపల్లి

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరంలో బుధవారం ఉదయం స్థానిక ఏవి అప్పారావు రోడ్‌లో ఉన్న ఆర్జేడీ కార్యాలయాన్ని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో కార్మికులు ముట్టడించారు. ఈ నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, రాష్ట్ర కోశాధికారి బి.వి.వి కొండలరావు, నాయకులు నెక్కంటి సుబ్బారావు, సీపీఐ రాష్ట్ర కార్య వర్గసభ్యుడు తాటిపాక మధు హాజరయ్యారు. రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ... మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వివిధ రంగాల వారికి ముఖ హాజరు విధానం (ఎఫ్ఆర్ఎస్)ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులలో ఎక్కువగా నిరక్షరాస్యులని, స్మార్ట్ ఫోన్ వినియోగించనవారు కూడా ఉన్నారన్నారు. ప్రభుత్వం కార్మికులను ఇబ్బంది పెట్టేవిధంగా కొత్త విధానాలు రుద్దడం సిగ్గుచేటు అన్నారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేసే వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. నెక్కంటి సుబ్బారావు, తాటికొండ వాసు మాట్లాడుతూ ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కొండలరావు, తాటిపాక మధు మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికులకు ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయకపోతే భవిష్యత్ ఉద్యమ కార్యచరణ చేపడతామని తెలిపారు. ఉమ్మడి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ రద్దు కోసం ఈ నెల 15వ తేదీన టూల్‌డౌన్ సమ్మెలో కార్మికులంతా పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భజంత్రీ శ్రీనివాసరావు, రాజమండ్రి ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కొండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వంగమూడి కొండలరావు, కృష్ణ, బొబ్బిలి శ్రీనివాసరావు, బంగారు రాజేష్, కిషోర్, రామకృష్ణ ,అల్లం వెంకటేష్, ధనాల దుర్గమ్మ ,గిరిబాబు, పెద్దిరెడ్డి సత్యనారాయణ, రెడ్డి బోడకొండ, నాగేశ్వరరావు, ముత్యం, కుమార్ నిమ్మకాయల శ్రీనివాసరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మున్సిపల్ కార్మికులు, పశ్చిమగోదావరి జిల్లా మున్సిపల్ కార్మికులు ఇతర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు వేలూరులో అమరుల సంస్మరణ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం అశువులు బాసిన అమరజీవులు బొంతా దానియేలు, బొంతా మస్తాన్ వర్ధంతి సందర్భంగా గురువారం సాయంత్రం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని వేలూరు గ్రామంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ తెలిపారు. అమరజీవులకు నివాళులర్పించిన అనంతరం గ్రామంలో ప్రజాప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఇప్టో జాతీయ కార్యదర్శి గని, సీపీఐ గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, ఎ.మారుతీ వరప్రసాద్ తదితర నాయకులు హాజరు కానున్నట్లు వివరించారు. ప్రజానాట్యమండలి అధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. పార్టీ నాయకులు, సానుభూతిపరులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

జర్నలిస్టులను శత్రువులుగా పరిగణించే ప్రభుత్వాలకు మనుగడ ఉండదు

ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): జర్నలిస్టులను శత్రువులుగా పరిగణించే ప్రభుత్వాలకు మనుగడ ఉండదని ఐజేయూ అధ్యక్షులు కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర, విజయవాడ అర్బన్ యూనిట్ అధ్వర్యంలో ముద్రించిన మీడియా డైరీలను బుధవారం ప్రెస్ క్లబ్‌లో ఆయన ఆవిష్కరించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ప్రభుత్వ విధానాలను విమర్శించే జర్నలిస్టులపై పదేపదే కేసులు పెట్టి వేధించడం అత్యంత దారుణమని అన్నారు. నిత్యం ప్రభుత్వ వ్యతిరేక వార్తలు రాసే పత్రికలపై ఇప్పటీ వరకూ ఎన్ని కేసులు పెట్టారో తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. కోవిడ్ సమయంలో మృతి చెందిన జర్నలిస్టులకు ఆర్థిక సహాయం చేసే విషయంలో ప్రభుత్వం జీవో విడుదల చేసి కూడా దాన్ని అమలు చేయక పోవడం అమానవీయమని అన్నారు. జర్నలిస్టులకు ఈ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందనే ఆశాభావం తనకు లేదని స్పష్టం చేశారు. హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్‌కు డబ్బులు చెల్లించమంటోందని, జర్నలిస్టులు వేసే భిక్షతోనే నడుస్తుందంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉందనేది అవగతం అవుతోందన్నారు. నిజంగా రాష్ట్ర ఖజానా అలాగే ఉందని తెలియజేస్తే భిక్షంగా భావించి చెల్లిస్తామన్నారు. ఐజేయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ఐజేయూ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి కృషి అభినందనీయమన్నారు. మూడున్నర దశాబ్దాలుగా యూనియన్ అధ్వర్యంలో డైరీలను ముద్రించడం ఎంతో గర్వకారణం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ మాట్లాడుతూ సీఎం ప్రకటించిన విధంగా కోవిడ్‌లో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అర్బన్ యూనిట్ అధ్వర్యంలో ఐజేయూ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్‌ను ఘనంగా సన్మానించారు. విజయవాడ యూనిట్ అర్బన్ కార్యదర్శి కొండా రాజేశ్వరరావు అతిథులకు స్వాగతం పలకగా, అధ్యక్షులు చావా రవి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు, కార్యదర్శి ఆర్.వసంత్, సామ్నా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రమణారెడ్డి, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.సాంబశివరావు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు ఏచూరి శివ తదితరులు పాల్గొన్నారు.

నిష్పాక్షికంగా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ

ఈసీకి ఎస్టీయు విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎమ్మెల్సీ ఎన్నికలు నిష్పాక్షికంగా జరగాలని, అధికార దుర్వినియోగాన్ని నిరోధించాలని కోరుతూ ఏపీ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న బుధవారం అమరావతి వెలగపూడి సచివాలయంలోని ఈసీ కార్యాల యంలో వినతి పత్రం అందజేశారు. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి ప్రచార కరపత్రాలతో కలిపి తాయిలాలిస్తున్నారని ఆరోపించారు. ప్రాంతీయ విద్యాధికారి తన హోదాను అడ్డంపెట్టుకుని సెలవు రోజుల్లో ఉపాధ్యాయ సంఘాల నేతలతో అనధికార సమావేశాన్ని కర్నూలులో నిర్వహించారని తెలిపారు. వీటన్నింటిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖేష్ కుమార్ మీనా స్పందిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రకటన రాగానే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం విజయవాడ ఎస్టీయూ కార్యాలయంలో ఎన్టీఆర్‌జిల్లా అధ్యక్షులు వి.భిక్షయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో తిమ్మన్న మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రైవేట్ బోగస్ ఓట్లు పదివేల వరకు ఉన్నాయని, వాటన్నింటినీ తొలగించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు వేతనాలెప్పుడు?

రాష్ట్రంలోని రెండు లక్షల మంది ఉపాధ్యాయులకు జనవరి వేతనాలు ఎప్పుడిసారని ప్రభుత్వాన్ని ఎస్టీయూ నేతలు ప్రశ్నించారు. మంగళగిరిలోని రాష్ట్ర ఖజానా కార్యాలయ సంచాలకులు మోహన్‌రావును కలిసి వేతనాల జాప్యంపై చర్చించారు. 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని, దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మోహన్‌రావు స్పందించి గురువారంలోగా వేతనాలిప్పించేందుకు యత్నిస్తానని చెప్పారు.

మంత్రి రోజాను కలిసిన మాలవ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పర్వతారోహకురాలు ఆశా మాలవ్య తన దేశవ్యాప్త సైకిల్ యాత్ర క్రమంలో బుధవారం మంత్రి ఆర్కే రోజాను మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళా భద్రత, సాధికారత అంశాలను విస్తృతంగా సమాజంలోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాలవ్యను రోజా అభినందించారు. సచివాలయంలోని తన చాంబర్‌లో మాలవ్యను కలిసిన రోజా ఆమెకు రాష్ట్రంలో అమలయ్యే మహిళా సాధికారత పథకాల గురించి వివరించారు. నాడు-నేడు పథకం కింద పాఠశాలల్లో టాయిలెట్ల అభివృద్ధి, మహిళల రక్షణ కోసం దిశా యాప్, మహిళా పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు, అన్ని రంగాల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్ల అమలు వంటివాటి గురించి తెలిపారు. మాలవ్య మాట్లాడుతూ తాను జాతీయ క్రీడాకారిణిని, మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘర్ జిల్లా, నతారామ్ గ్రామానికి వాస్తవ్యురాలనని చెప్పారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 25వేల కిమీలు సైకిల్ యాత్ర చేయాలని లక్ష్యం పెట్టుకున్నానని చెప్పారు.

మనువాదాన్ని తిరగదోడుతున్న బీజేపీ ప్రభుత్వం

ఏపీ మహిళా సమాఖ్య ఆగ్రహం

విశాలాంధ్ర-విజయవాడ: మనువాద స్మృతులను తిరగదోడి మహిళల జీవితాలను మరింత అధఃపాతాళానికి నెట్టివేయడమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ధ్యేయంగా కనిపిస్తోందని మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం లోక్‌సభలో రాష్ట్రపతికి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో బీజేపీ ఎంపీ చంద్రప్రకాష్ జోషి 'సతీసహగమనం చాలా మంచి ఆలోచన' అంటూ మాట్లాడిన తీరుపై ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య విజయవాడ నగర శాఖ అధ్వర్యంలో హనుమాన్‌పేటలోని దాసరి భవన్ వద్ద బుధవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని దుర్గాభవాని మాట్లాడుతూ దాదాపు 200 సంవత్సరాల క్రితం రద్దయిన సతీసహగమన చట్టాన్ని మరలా తీసుకొచ్చే ఆలోచనలో బీజేపీ ప్రభుత్వం ఉందా? అనే అనుమానం బీజేపీ ఎంపీ మాటల్లో కలుగుతోందని అన్నారు. ఒకవైపు మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం, సాధికారత, రక్షణ, భద్రత అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తూ, మరోవైపు మనువాద స్మృతులను తిరగదోడుతోందని విమర్శించారు. భారత రాజ్యాంగంలోని స్త్రీ, పురుష సమానత్వం అనే అంశానికి తిలోదకాలిచ్చారని, స్త్రీలను అభివృద్ధి నిరోధకులుగా చూపించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తూ మహిళాభివృద్ధికి, సమానత్వ సాధనకు తూట్లు పడే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ చాప కింద నీరుల హిందూ ఉన్మాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి మెజారిటీ హిందువుల ఓట్లతో మరలా గద్దెనెక్కాల ప్రయత్నిస్తోందని తెలిపారు. మహిళా సమాఖ్య విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంలోని మంత్రులు మాట్లాడుతున్న తీరు దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందని, సతీసహగమనం లాంటి దురాచారానికి మద్దతు పలుకుతూ మహిళల జీవితాలను మరింత కష్టాల సుడిగుండంలోకి నెట్టి వేస్తున్నారని విమర్శించారు. బీజేపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే మహిళా రిజర్వేషన్ బిల్లును ఎందుకు ఇంతవరకు ఆమోదించలేదని సూటిగా ప్రశ్నించారు. ఎంపీ చంద్రప్రకాష్ జోషి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు తమ్మిన దుర్గ, దుర్గాసి రమణమ్మ, డి.సీతారావమ్మ, డి.పుష్ప, రాహేలమ్మ, అండిమాని నాగమణి, చింతాడ పార్వతి, నక్కా రాజ్యలక్ష్మి, సావిత్రి, తానా సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

11న చట్టబద్ధ పాలన-భారత ప్రజాస్వామ్యంపై సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ప్రజాస్వామ్యం, అభివృద్ధి అధ్యయన వేదిక అధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం 3.30 నిమిషాలకు విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో 'చట్టబద్ధ పాలన-భారత ప్రజాస్వామ్యం' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు సి.నరసింహారావు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు కొండవీటి చిన్నయసూరి తెలిపారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమాజంలో వ్యక్తుల మధ్య, వ్యక్తుల సమూహాల మధ్య, వ్యక్తుల రాజ్యం మధ్య ఉండే సంబంధాలు అర్థవంతంగా, ప్రయోజనకరంగా ఉండేటట్లు చూడటమే సామాజిక జీవన లక్ష్యమని అన్నారు. తమ జీవన స్థితిగతులను ఏ నిర్ణయాలు ప్రభావితం చేస్తాయో ఆ నిర్ణయాలు చేయడంలో ప్రజలకు సముచిత పాత్ర ఉండటం, ఎన్నికలలో పౌరులు స్వేచ్ఛగా ప్రభుత్వాలను ఎన్నుకునే హక్కు కలిగి ఉండటం, స్వేచ్ఛ, సమానత్వం తదితర ప్రాథమిక హక్కులను కలిగి ఉండి జీవనం సాగించగలగడం ప్రజాస్వామ్య సంవిధాన లక్ష్యం, స్వభావం, ఆచరణగా ఉండాలన్నారు. మనం ఎదుర్కొనే సామాజిక అంశాలను, సమస్యలను ఒక క్రమ పద్ధతిలో అధ్యయనం చేసి ఒక ఉమ్మడి అవగాహనకు రావడం ద్వారా ప్రభుత్వ విధానాలను, ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయగలిగినటువంటి సంస్థల అవసరం ఎంతో అవసరం ఉందన్నారు. అటువంటి లక్ష్యంతో ఫోరం ఫర్ డెమోక్రసీ అండ్ డెవలప్‌మెంట్ అనే సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సదస్సులో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎ.గోపాల గౌడ, లోక్‌సత్తా వ్యవస్థాపక నాయకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ, శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు, ఆంధ్రప్రదేశ్ మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ ఎ.సత్యప్రసాద్ వక్తలుగా పాల్గొంటారని వివరించారు. డాక్టర్ జయప్రకాష్ నారాయణ అధ్యక్షత వహిస్తారన్నారు. విలేకరుల సమావేశంలో విశ్రాంత ఆచార్యులు ఎం.అంజయ్య, జి.రోశయ్య పాల్గొన్నారు.

రేపు బ్యాంకుల వద్ద ఆందోళనలు

13 నుంచి ప్రాజెక్టుల సందర్శన: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పారిశ్రామికవేత్త అదానీ ఆస్తుల్ని ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న గుంటూరు జిల్లాలోని అన్ని బ్యాంకుల వద్ద జరిగే ఆందోళనలో పాల్గొనాలని పార్టీ శ్రేణులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని బ్యాంకుల దగ్గర ఆందోళన కార్యక్రమానికి సీపీఐ శ్రీకారం చుట్టిందన్నారు. మండల, నియోజకవర్గస్థాయిలో ఉన్న అన్ని బ్యాంకుల వద్ద ధర్నా నిర్వహించి అదానీ చేసిన మోసాన్ని ఎలుగెత్తి చాటుదామని, ప్రధాని మోదీ, అదానీ దేశ ఆర్థిక వ్యవస్థని ఏ విధంగా చిన్నాభిన్నం చేశారో ప్రజలకు తెలియజేద్దామన్నారు. మోదీ లాంటి ప్రధాని ఉంటే భారతదేశం గాఢాంధకారంలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. అదానీ, మోదీ పరస్పర సహకారంతో దేశాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. మోదీ కారణంగానే అదానీ ప్రపంచ కుబేరుడిగా అవతరించారని చెప్పారు. ఎల్ఐసీ, జీఐసీ, బీఎస్ఎన్ఎల్, పోర్టులు వంటి ప్రభుత్వ ఆస్తులను అదానీకి మోదీ కట్టబెడుతున్నారని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌పై విమర్శలు గుప్పిస్తూ అది గుజరాత్ బడ్జెట్, కర్ణాటక ఎన్నికల బడ్జెట్, దేశ ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడని బడ్జెట్ అని విమర్శించారు. ఈ బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని, ప్రత్యేక హోదా, విభజన హామీలు, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్ తదితర అంశాల గురించి చర్చించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల పరిస్థితి దారుణంగా ఉందని, ముఖ్యమంత్రులు మారుతున్నప్పుడల్లా శిలాఫలకాలు మారుతున్నాయే తప్ప ప్రాజెక్టులు పూర్తికావడం లేదని జంగాల విమర్శించారు. ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్వర్యంలో ప్రాజెక్టులు సందర్శన కార్యక్రమం ఈనెల 13వ తేదీ నుండి చేపట్టనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, పుప్పాల సత్యనారాయణ, షేక్ వలి, ఇప్టా జాతీయ కార్యదర్శి గని తదితరులు పాల్గొన్నారు.

ఎగువ భద్ర నిర్మాణాన్ని తెలుగు రాష్ట్రాలు అడ్డుకోవాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర-ఆదోని రూరల్: తుంగభద్రా నదికి ఎగువన అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించి సీడబ్ల్యూసీ అనుమతి పొందినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎందుకు నోరు మెదపడం లేదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య ప్రశ్నించారు. బుధవారం రెడ్డీస్ ఫంక్షన్ మైదానంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మి రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన వామపక్ష, ప్రతిపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం, టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జ్ ఆది గుడిసె కృష్ణమ్మ, ఆర్పీసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు మల్లికార్జున, ప్రసాద్, జనసేన తాహేర్ వలి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలు పడుతున్న ఆర్థిక అవస్థలను దృష్టిలో ఉంచుకొని 1953న తుంగభద్ర ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి నీటి వాటాను కేటాయించారని తెలిపారు. తుంగభద్రా నది ఎగువన అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం చేపడితే రాష్ట్రంలో 1953 మునుపు ప్రజల ఆర్థికస్థితిగతులు ఉండేవో, అలాగే అంతకుమించి కరువుకాటకాలు సంభవిస్తాయని హెచ్చరించారు. ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణం చేపడితే దిగువన ఉన్న తుంగభద్ర ప్రాజెక్టుకు నీళ్లు రాక కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాలో ప్రజలు తీవ్ర స్థాయిలో నష్టపోతారని, కనీసం తాగడానికి నీళ్లు దొరికే పరిస్థితి ఉండదని దుయ్యబట్టారు. తుంగభద్రా నది దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టులో నీళ్లు లేక విద్యుత్ సమస్య తీవ్రతరమవుతుందని, విద్యుత్ సమస్య రాష్ట్ర ప్రభుత్వాలకు గుదిబండలా మారుతుందని హెచ్చరించారు. ప్రస్తుతం పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుంటే, ఏడాదికి రెండు పంటలు పండితేనే ఆర్థిక స్థితిగతులు మారతాయని తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు నిర్మాణానికి జాతీయ హోదా కల్పించి బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ఈ విషయాన్ని పసిగట్టలేకపోయాయా అని విమర్శలు గుప్పించారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ మండల కార్యదర్శి సుదర్శన్ బసాపురం గోపాల్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న, అజయ్ బాబు, జిల్లా నాయకులు వీరేష్, దేవిశెట్టి ప్రకాష్, విజయ్, శీనా, మురళి, అయ్యన్న, మనీ, పులి రాజు తదితరులు ఉన్నారు.

తెలుగు సినీ ప్రముఖులకు ఏపీ మంత్రివర్గం నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇటీవల మరణించిన తెలుగు సినీప్రముఖులకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం నివాళులర్పించింది. కృష్ణ, కృష్ణంరాజు, కైకాల సత్యనారాయణ, చలపతిరావు, ఎం.బాలయ్య, కె.విశ్వనాథ్, వాణి జయరామ్, జమున, డైరెక్టర్ సాగర్‌కు అంజలి ఘటించింది. మంత్రివర్గ సమావేశం సీఎం జగన్ అధ్యక్షతన సచివాలయంలో జరిగింది.

సంపాదకీయం

కుమ్మరి ఆవంలా ఇరాన్

ఇరాన్‌లో పరిస్థితి గత కొన్ని నెలలుగా అల్లకల్లోలంగా ఉంది. వచ్చే శనివారం నాటికి ఇరాన్‌లో రాజరికం కుప్పకూలి ఇస్లామిక్ ప్రభుత్వం ఏర్పడి 44 ఏళ్లు పూర్తవుతుంది. 1979లో ఇరాన్ రాజు షా మహమ్మద్ రెజా పెహ్లవీ ప్రభుత్వం కుప్పకూలిపోయింది. ఇందులో అమెరికా హస్తం భారీగా ఉంది. ప్రజాస్వామ్యాన్ని ఎగుమతి చేయాలన్న అమెరికా ప్రయోగం విఫలంఅయి అక్కడ అయతుల్లా ఖొమేనీ నాయకత్వంలో ఇస్లామిక్ ప్రభుత్వం ఏర్పడింది. ఇది రాజరికం కన్నా ఏ మాత్రం మెరుగైంది కాదని గత 44 ఏళ్ల చరిత్ర నిరూపించింది. గత నాలుగైదు నెలలుగా ఇరాన్‌లో ఎక్కడ చూసినా నిరసన ప్రదర్శనలే కనిపిస్తున్నాయి. ఈ సారి నిరసనలు ఇస్లామిక్ పాలకుడు ఇబ్రహీం రైసికి వ్యతిరేకం కావడం సానుకూల పరిణామం అనుకోవచ్చు. మహసా అమీనీ అనే అమ్మాయి హిజాబ్ సవ్యంగా ధరించలేదని అరెస్టు చేశారు. ఆమె పోలీసు నిర్బంధంలో మరణించిన తరవాత 2022లో సెప్టెంబర్ 16న నిరసనోద్యమం మొదలైంది. ఇరాన్‌లో ఇస్లామిక్ పాలనలో హిజాబ్ ధరించి తీరాలన్న చట్టం ఉంది. గత సెప్టెంబర్‌లో మొదలైన నిరసన జ్వాలలు ఇంకా రేగుతూనే ఉన్నాయి. పౌరుల్లో అశాంతి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అమీనీ నివసించే సఖెజ్‌లో ప్రారంభమైన నిరసన క్రమంగా దేశవ్యాప్తమైంది. ఈ ఆందోళనలను అణచడానికి ఇరాన్ ప్రభుత్వం అంతర్జాల సదుపాయం లేకుండా చేసింది. దేశవ్యాప్తంగా సామాజిక మాధ్యమాలను వినియోగించడంపై ఆంక్షలు విధించింది. పోలీసుల దమనకాండ నిత్యకృత్యమైంది. హిజాబ్ ధరించాలన్న చట్టబద్ధ నిబంధనను విద్యార్థినులు బాహాటంగా ఉల్లంఘిస్తున్నారు. "మహిళల జీవితం మహిళలదే, మహిళలకు స్వేచ్ఛ కావాలి," "నియంత నశించాలి" అన్న నినాదాలు విద్యాసంస్థలలో సర్వవ్యాప్తమైనాయి. అయతుల్లా అలీ ఖొమేనీని ధిక్కరించడం విపరీతంగా పెరిగిపోయింది. మానవ నిర్మిత చట్టాలకన్నా భగవంతుడి శాసనం ప్రధానమైంది అన్న వాదనను నిరసనకారులు బాహాటంగా వ్యతిరేకిస్తున్నారు. గత అక్టోబర్ 8న అల్‌జహ్రా విశ్వవిద్యాలయంలో అయితే దేశాధ్యక్షుడు ఇబ్రాహిం రైసి పర్యటన సందర్భంగా "మత నాయకులారా అడ్డు తొలగండి" అని దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. ఇరాన్ ప్రభుత్వం మహిళలను రెండవ శ్రేణి పౌరులుగా పరిగణించడాన్ని మహిళాలోకం అంగీకరించడం లేదు. వారిని పాలకులు చదువుకోనివ్వడం లేదు. ఇష్టమైన వారిని పెళ్లాడనివ్వడం లేదు. విడాకులు తీసుకోనివ్వడం లేదు. ఇష్టానుసారం తిరగడానికి కూడా అనుమతించడంలేదు. తలమీద ఆచ్ఛాదనలేని మహిళలను వేధిస్తున్నారు. అఫ్గానిస్థాన్‌లో తాలిబాన్ల ఆంక్షలను మహిళలు గడిచిన 14 నెలలుగా ప్రతిఘటిస్తున్నట్టే ఇరాన్ మహిళలు కూడా తమ అస్తిత్వం కోసం, ఆత్మగౌరవం కోసం గళమెత్తుతున్నారు. వారి దీక్ష మార్పు అనివార్యం అన్న సంకేతాలిస్తోంది.

1979నాటి ఇరాన్ ఇస్లామిక్ విప్లవం వార్షికోత్సవం సందర్భంగా నెదర్లాండ్స్‌లోని గామాన్ సంస్థ ఇరాన్‌లో ప్రజాభిప్రాయం సేకరించింది. ఆ సర్వే ఫలితాలు ఆశ్చర్యకర పరిణామాలకు అద్దం పడుతున్నాయి. ఇరాన్‌లోని 1,58,000 మంది, 132 ఇతరదేశాల్లోని 42,000 మంది అభిప్రాయాలను ఈ సర్వేలో క్రోడీకరించారు. అత్యధిక సంఖ్యాకులు ఇస్లామిక్ పరిపాలనను ఈసడిస్తున్నట్టు ఈ సర్వేలో వెల్లడైంది. ఇరాన్ ఇంటర్నేషనల్ అనే సంస్థ ప్రభుత్వ వ్యతిరేక నిరసనలకు ఆజ్యం పోస్తోంది అని ఇరాన్ ప్రభుత్వం అక్కసు వెళ్లగక్కుతోంది. ఇందులో సౌదీ అరేబియా ప్రమేయం కూడా ఉంది అని ఇరాన్ ప్రభుత్వం వాదిస్తోంది. పర్షియన్ సింధు శాఖలో అరబ్బు దేశం కానిది ఇరాన్ ఒక్కటే అన్న వాస్తవాన్ని గ్రహిస్తే ఇరాన్ ప్రభుత్వం సౌదీ అరేబియాపై విరుచుకుపడడానికి కారణం ఏమిటో అర్థం అవుతుంది. 2010లో ఈజిప్ట్‌తో పాటు పశ్చిమాసియాలోని అనేక దేశాల్లో పెల్లుబికిన ప్రజోద్యమాలు 2019, 2020లో లెబనాన్, అల్జీరియా, ఇరాక్, సూడాన్‌లో ప్రభుత్వాలను గద్దె దించడానికి ఉపకరించాయన్న విషయాన్ని గుర్తు చేసుకుంటే ఇరాన్ మహిళలు ప్రస్తుతం కొనసాగిస్తున్న ఉద్యమ తీవ్రత లోతు తెలుస్తుంది. ఇరాన్‌లో తక్షణం సమూలమైన మార్పులు రావడానికి అవకాశం లేకపోవచ్చు కాని ఉద్యమ ప్రకంపనల ప్రభావం మాత్రం దీర్ఘకాలం కొనసాగేట్టే ఉంది. నెదర్లాండ్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌గా ఉండాలా లేదా అని అడిగితే 80.9 శాతం నిర్ద్వంద్వంగా ఒద్దు అని బదులిచ్చారు. విదేశాల్లో నివసిస్తున్న ఇరాన్ వాసుల్లో 99శాతం మంది ఇస్లామిక్ రిప్లబిక్‌ను ఏవగించుకుంటున్నారు. 80 శాతం మంది ప్రజలు ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను సమర్థిస్తున్నారు. మార్పు అనివార్యం అని 67శాతం మంది విశ్వసిస్తున్నారు. 73 శాతం మంది ప్రజలు పశ్చిమ దేశాలు తమ నిరసనోద్యమాలను సమర్థించాలని కోరుకుంటున్నారు. నిరసనలు, ప్రభుత్వ వ్యతిరేక భావాలు ఒక నిర్మాణాత్మక రూపం తీసుకోవాలని 85శాతం మంది అభిప్రాయ పడ్తున్నారు. ప్రతిపక్ష శక్తులన్నింటినీ సంఘటితం చేయాలన్న ఆలోచన నిరసనకారుల్లో ఉంది. ఈ ప్రతిపక్ష సంఘటనలో విదేశాల్లో ఉంటున్న ఇరాన్ దేశస్థులకు కూడా భాగస్వామ్యం ఉండాలన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

కొంతమంది అయితే తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం కొనసాగకూడదన్న భావన ఎంత బలంగా ఉన్నప్పటికీ భవిష్యత్తు రాజకీయ వ్యవస్థ ఎలా ఉండాలి, ఇస్లామిక్ రిపబ్లిక్ స్థానంలో ఎలాంటి వ్యవస్థ రూపుదిద్దుకోవాలి అన్న అంశం మీద మాత్రం ఎవరికీ నిర్దిష్టమైన అభిప్రాయం కనిపించడం లేదు. ఇరాన్‌లో ఉంటున్న వారిలో 28శాతం మంది, విదేశాల్లో ఉంటున్న ఇరాన్ వాసుల్లో 32శాతం మంది అధ్యక్ష తరహా పాలనవేపు మొగ్గు చూపుతున్నారు. ఇరాన్ పౌరుల్లో 22శాతం, ప్రవాసంలో ఉన్న వారిలో 25శాతం మంది రాజ్యాంగ బద్ధమైన రాచరికాన్ని కోరుకుంటున్నారు. అంటే వీరి అభిప్రాయం ప్రకారం, వర్జీనియాలోఉంటున్న మాజీరాజు షా మహమ్మద్ రెజాపహల్వీ కుమారుడు రెజా షా పహల్వీ పరిపాలనా బాధ్యతలు స్వీకరించాలను కుంటున్నారు. ఇరాన్ పౌరుల్లో 12 శాతం, విదేశాల్లోని ఇరాన్ జాతీయుల్లో 29శాతం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మెరుగైందని అభిప్రాయపడ్తున్నారు.

సగటున 60 శాతం మంది అర్థవంతమైన మార్పు కనిపించాలంటే ప్రస్తుత ప్రభుత్వం గద్దె దిగాల్సిందేనని నమ్ముతున్నారు. అయితే ఇరాన్ రాజు కుమారుడు అధికారం చేపట్టే అవకాశాలు చాలా బలహీనంగానే ఉన్నాయి. ప్రజలలో పొడసూపుతున్న మనోభావాలకు, భవిష్యత్ మార్గ దర్శనం మధ్య ఉండవలసినంత సంయోగం ప్రస్తుతానికైతే కనిపించడం లేదు. అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్న ఆలోచన అత్యధిక సంఖ్యాక ప్రజల్లో వ్యక్తమవుతున్నా భవిష్యత్ రాజకీయ స్వరూపం ఎలా ఉంటుంది, లేదా ఎలా ఉండాలన్న విషయంలో ఎక్కడా స్పష్టతా, ఏక సూత్రత ఉన్నట్టు లేదు. ప్రజోద్యమాన్ని ప్రజాస్వామ్య వ్యవస్థవేపు నడిపించే నాయకత్వం లేకపోవడం ఇరాన్ విషాదం.

భూకంప మృత్యుకేళి

ఫిబ్రవరి 6 వ తేదీ ఉషోదయాన జరిగిన భయంకర భూకంప మృత్యుకేళితో టర్కీ, సిరియా నగరాలు (అలెప్పో, హోమా లాంటి) విలవిల్లాడడం, పేక మేడల్లా బహుళ అంతస్తుల భవనాలు నేలమట్టం కావడం, శిథిలాల దిబ్బలుగా మారడం, వేల కొద్ది జనులు శిథిలాల కింద పడి తుది శ్వాస విడవడం చూస్తుండగానే జరిగిపోయింది. ప్రసార మాధ్యమాల్లో వీడియోలు చూసిన ప్రపంచ మానవాళి నివ్వెరపోయింది. కొద్ది గంటల్లోనే రిక్టర్ స్కేలు పై 7.8, 7.6. 6.0 పరిమాణంతో మూడు సార్లు భూమి కంపించడంతో దక్షిణ-కేంద్ర టర్కీ ప్రాంతంలో గాజియన్టెక్ నగరంతో పాటు మరో 10 నగరాల్లో భవనాలు (రోడ్లు, నివాస భవనాలు, కార్లు, వాహనాలు, షాపింగ్ మాల్స్, విమానాశ్రయాలు) పూర్తిగా నేల మట్టం కావడం లేదా పాక్షికంగా ధ్వంసం కావడంతో రెండు మిలియన్ల ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఇప్పటి వరకు దాదాపు 10 వేల మంది చనిపోయారని వార్తలు వస్తున్నాయి. తొలి భూకంప విపత్తు తరువాత కనీసం 40 సార్లు భూమి కంపించడంతో టర్కీ, సిరియాలు గజగజ వణికిపోతూ, ప్రజలు హాహాకారాలు చేస్తూ రోడ్ల వెంట ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని నిస్సహాయంగా పరుగులు తీసారు. గత వందేళ్ళలో ఇంతటి భూకంపం రాలేదని గాజియాన్టెక్ నగరానికి 33 కిమీ దూరంలో 18 కిమీ లోతులో భూకంప ప్రభావ కేంద్రం కనిపించడంతో గజియాన్టెక్ నగరంలోని 2,200 ఏళ్ళ క్రితం నాటి రోమన్ కాలపు చారిత్రక కట్టడం కూడా పూర్తిగా ధ్వంసం అయింది.

భూకంపాలకు నెలవుగా మారిన టర్కీ ఒక్క 2000 సంవత్సరంలోనే 33,000 భూకంపాలు రికార్డు అయ్యాయని, ఇందులో రిక్టర్ స్కేలు పై 4.0 పరిమాణంతో 332 సార్లు కంపించిందని అంచనాలున్నాయి. టర్కీ దేశం భూకంపాల ముప్పు ఉన్న టెక్టోనిక్ ప్రదేశంగా గతంలోనే గుర్తించారు. భూమి అంతర్భాగంలో ఉన్న 15 ముఖ్య ఫలక పొరలను టెక్టోనిక్ ఫలకాలు(ప్లేట్స్)గా పిలుస్తారు. ఈ కదిలే స్వభావం కలిగిన ఫలక పొరల మధ్య రాపిడితో పగుళ్ళు, ఆకస్మిక కదలికలతో అపార శక్తి వెలువడడం వల్ల భూకంపాలు వస్తున్నట్లు ఆర్కియాలజీకల్ సర్వేలు వివరిస్తున్నాయి. యురాసియన్, ఆఫ్రికన్ ప్లేట్స్ మధ్య చీలిక ఏర్పడిన అనటోలియన్ టెక్టోనిక్ ఫలకాల్న(ప్లేట్స్) ఉన్న ప్రాంతంలో టర్కీ ఉన్నది. యురాసియన్, అనటోలియన్ టెక్టోనిక్ ఫలకాలు కలిసే ప్రదేశమైన 'నార్త్ అనటోలియన్ ఫాల్ట్ లైన్' వద్ద భూకంప విధ్వంసం అధికంగా కనిపిస్తున్నది. పేదరికం రాజ్యమేలుతున్న టర్కీ, సిరియాల్లో అంతర్గత అశాంతి మంటలతో ప్రజలు అభద్రతల నడుమ బిక్కు బిక్కున బతుకులు ఈడుస్తున్నారు. సిరియాలో అంతర్గత యుద్ధం, టర్కీలో 30 లక్షలకు పైగా సిరియన్ శరణార్థుల చేరడం, భవనాలు బలహీనంగా నిర్మించడం, జనసాంద్రత ఎక్కువగా ఉండడం లాంటి సమస్యలు భూకంప నష్టాలను అనేక రెట్లు పెంచాయని నిపుణులు చెప్తున్నారు.

ఫిబ్రవరి 03 శుక్రవారం రోజున 'ఫ్రాంక్ హూగర్‌బీడ్స్' అనే డచ్ పరిశోధకులు టర్కీ, జోర్డన్, లెబనాన్, సిరియా ప్రాంతాల్లో 7.5 రిక్టర్ స్కేలు కలిగిన తీవ్ర భూకంపం సమీప భవిష్యత్తులో రావచ్చని ట్వీట్ రూపంలో హెచ్చరించడం నేడు చర్చనీయాంశంగా మారింది. ఈ భూ ప్రళయం తరువాత కూడా వెంటనే తిరిగి భూకంపాలు రావచ్చని, ప్రజలు ముందు జాగ్రత్తగా ఉండాలని కూడా ఫ్రాంక్ హూగర్‌బీడ్స్ సలహాలు ఇవ్వడాన్ని పెడచెవిన పెట్టరాదని చెప్తున్నారు.

మధుపాళి

బెలూన్లకు మార్గదర్శి అమెరికా

సత్య

తమ మీద నిఘాకోసం చైనా పంపిన పెద్ద బెలూన్‌ను కూల్చివేసినట్లు అమెరికా ప్రకటించింది. స్థానిక కాలమానం ప్రకారం ఫిబ్రవరి నాలుగవ తేదీ శనివారం మధ్యాహ్నం రెండు గంటల 39 నిమిషాలకు తీరానికి ఆరు నాటికల్ మైళ్ల దూరంలోని సముద్రం మీద పేల్చివేసింది. పరిసరాలలో కొద్ది గంటల పాటు విమానాల రాకపోకలను నిలిపివేసి అనేక ఫైటర్ జెట్ విమానాలను రంగంలోకి దింపినప్పటికీ ఒక్క విమానం నుంచి మాత్రమే బెలూన్‌పై కాల్పులు జరిపారు. సముద్రం మీద కొన్ని చదరపు కిలోమీటర్ల పరిధిలో పడిన శకలాలను సేకరించేందుకు పూనుకున్నారు. సముద్రంలో మునిగిన వాటిని తీసేందుకు కొన్ని రోజులు పట్టవచ్చు. వాటిలో దొరికినదేమిటి ? ఎలాంటి సమాచారాన్ని అవి నిక్షిప్తం చేసిందీ వెల్లడి కావాల్సి ఉంది. ఈ ఉదంతాన్ని సాకుగా చూపుతూ నిరసనగా ఫిబ్రవరి ఆరున జరపాల్సిన చైనా సందర్శనను వాయిదా వేసుకున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ ప్రకటించాడు. వాతావరణాన్ని విశ్లేషించేందుకు తాము పంపిన బెలూన్ గాలి తీవ్రత కారణంగా అదుపు తప్పి అమెరికా గగనతలంలోకి ప్రవేశించింది తప్ప కావాలని పంపలేదని, దాన్ని కూల్చివేసి అమెరికా అతిగా స్పందించిందని చైనా విమర్శించింది. దీన్ని గమనంలో ఉంచుకొని తాము కూడా చేయాల్సింది చేస్తామన్నట్లుగా హెచ్చరించింది. అది వాతావరణం కోసం కాదు తమ మీద నిఘా కోసమే పంపినందున కూల్చివేసినట్లు అమెరికా చెబుతోంది. మూడు బస్సులు లేదా లారీలకు సమానమైన పరిమాణంలో ఉన్న మానవరహిత బెలూన్, సముద్రం మీద కూల్చివేసినందున ఆస్తినష్టం కూడా జరగలేదు గనుక సుఖాంతంగా ముగిసింది. ఇతర దేశాలపై నిఘా అంకానికి తెరతీసి ప్రపంచానికి నేర్పింది అమెరికానే. దొంగకళ్ల బెలూన్లను, విమానాలను పంపి వాటిని, ఎగిరే పళ్లాలు, గ్రహాంతర వాసులుగా ప్రపంచాన్ని నమ్మించటమే కాదు, వాటిపై సినిమాలుతీసి జనం మీదకు వదిలింది కూడా అమెరికన్లే. అరుణాచల్ ప్రదేశ్‌లోని మన ప్రాంతంలో చైనా గ్రామాలను నిర్మిస్తున్నదంటూ అమెరికా పంపిన చిత్రాల సంగతి తెలిసిందే. ఆ గ్రామాలను తమ ప్రాంతంలోనే చైనా నిర్మించినప్పటికీ వక్రీకరించి మనలను ఎగదోసేందుకు అమెరికా చూసింది. దేశాల మధ్య పరస్పరం విశ్వాసలేమి, ఆధిపత్యం కోసం ఎత్తులకు పైఎత్తులు వేస్తున్న స్థితిలో బెలూన్లతో రకరకాల నిఘా అన్నది బహిరంగ రహస్యం. రెండవ ప్రపంచ పోరు తరువాత అనేక దేశాల మీదకు అమెరికన్లు బెలూన్లు వదిలారు. వాతావరణం కోసం వదిలినవి కూడా వాటిలో కొన్ని ఉండవచ్చు. ప్రపంచాన్ని తప్పుదారి పట్టించటంలో అమెరికాను మించింది లేదు. ఇరాక్‌లోలేని మారణాయుధాల గుట్టల గురించి ప్రచారం చేసి దాని మీద దాడికి దిగి అధ్యక్షుడు సద్దామ్ హుస్సేన్‌ను హతమార్చింది. తాము సృష్టించిన తాలిబాన్లనే మతోన్మాదులు తమ మీదకే ఎదురు తిరిగిందీ మన కళ్ల ముందే జరిగింది. అంతకు ముందు అఫ్గానిస్థాన్ విముక్తి వీరులుగా చిత్రించిందీ, ఆయుధాలుఇచ్చిందీ, తరువాత ఉగ్రవాదులని ప్రచారంచేసి రెండు దశాబ్దాల పాటు అక్కడ తిష్టవేసి, వారిని అణచివేసి, చివరికి వారితోనే రాజీ చేసుకున్న సంగతి తెలిసిందే. వాతావరణం గురించి పరిశోధించేందుకు పంపిన యు-2 అనే తమ విమానం టర్కీలో కనిపించకుండా పోయిందని పైలట్ మరణించినట్లు 1960లో అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ ప్రకటించాడు. అందరూ నిజమే అని నమ్మారు. కానీ కొద్ది రోజుల తరువాత సదరు విమాన పైలట్ ఫ్రాన్సిస్ గారీ పవర్స్ తమ వద్ద ప్రాణాలతో ఉన్నాడని నాటి సోవియట్ నేత కృశ్చేవ్ ప్రకటించి అమెరికా గాలి తీశాడు. ఆ నిఘా విమానాన్ని ఆ ఏడాది మే ఒకటవ తేదీన సోవియట్ క్షిపణులు కూల్చివేశాయి. పైలట్ బతికాడు. దాన్ని పంపింది నిజమే అని తరువాత ఐసెన్ హోవర్ అంగీకరించినా కనీసం విచారం కూడా ప్రకటించలేదు. తరువాత రెండు దేశాల మధ్య విబేధాలు మరింత ముదిరాయి. అనేక రంగాల్లో ముందున్న అమెరికా తనదగ్గర ఎంత ప్రమాదకరఅస్త్రం ఉందో ప్రపంచాన్ని బెదిరించేందుకు అవసరం లేకున్నా జపాన్‌పై అణుబాంబు వేసింది. దాన్ని సమర్థించు కొనేందుకు తమ పెరల్ హార్బర్ మీద దాడి జరిపిందనే కట్టుకథను ప్రచారం చేసింది. నిజానికి ఆ బాంబును చూపి సోవియట్ మీద పైచేయి తమదే అని ప్రదర్శించుకొనే ఎత్తుగడ కూడా ఉంది. సరే తరువాత స్టాలిన్ కూడా అణుబాంబును తయారు చేయించి, అంతరిక్ష విజయాలను చూపి అమెరికాను అదుపులో ఉంచాడు. స్టాలిన్ తరువాత కృశ్చేవ్ అధికారానికివచ్చాడు. అణుబాంబు తరువాత ఆందోళన చెందిన అమెరికా ఇంకా సోవియట్ వద్ద ఉన్న అస్త్రాలేమిటో తెలుసుకొనేందుకు నిఘా విమానాలను దాని గగనతలం మీద తిప్పింది. అవి భూమికి 70వేల అడుగుల ఎత్తున ఎగురుతున్నట్లు సోవియట్ పసిగట్టింది. 1956 నుంచి అలాంటి విమానాలను తిప్పుతున్నట్లు గమనించినప్పటికీ మౌనంగా ఉంది. వాటిని కూల్చగల క్షిపణి తయారుచేసి పైన పేర్కొన్న విమానాన్ని కూల్చివేసి తమ సత్తాను లోకానికి చాటింది. అమెరికాను ఢీ కొంటున్న చైనా నాటి సోవియట్ కంటే ఎంతో బలమైనది, కొన్ని రంగాల్లో అమెరికాకు ధీటుగా కాస్త పైచేయిగా ఉంది.

హీలియం వాయువుతో నింపిన బెలూన్లను గగన తలంలో 24 నుంచి 37 కిలోమీటర్ల ఎత్తు వరకు ఎగురవేయవచ్చు. యుద్ధ విమానాలు 20, వాణిజ్య విమానాలు 12 కిలోమీటర్ల ఎత్తువరకు ఎగురుతాయి. వాటికి అవసరమైన ఇంధనాన్ని అందించేందుకు సూర్యరశ్మిని విద్యుత్‌గా మార్చే పరికరాలను అమర్చుతారు. వాటితో పాటు నిఘా కెమెరాలను కూడా పెడతారు. 1983లో దక్షిణ కొరియా విమానం గూఢచర్యానికి పాల్పడు తున్నదనే అనుమానంతో సోవియట్ మిలిటరీ దాన్ని కూల్చివేసింది. తరువాత అది పౌర విమానం అని తేలింది. 2001లో దక్షిణ చైనా సముద్రం మీద నిఘాకోసం వచ్చిన అమెరికా విమానాన్ని చైనా విమానాలువెంటాడి, తమ స్థావరంలో దిగేట్లు చేశాయి. చైనా సత్తాను తక్కువ అంచనా వేసిన ఆ విమాన సిబ్బంది, దాన్ని నడిపించిన విభాగానికి ఆ ఉదంతం పెద్ద ఎదురుదెబ్బ. మనం చైనా గుట్టు తెలుసుకోవటం సంగతి అటుంచి విమానాన్ని దారిమళ్లించ కుండా, పేల్చివేయకుండా వారి స్థావరానికి పంపి మన ఆధునిక నిఘా సాంకేతిక పరిజ్ఞానాన్ని చైనాకు సమర్పించుకున్నామని అమెరికన్లు లోలోపల కుమిలిపోయారు. ఏ దేశ గగన తలంలోనైనా అనుమతి లేకుండా ఇతర దేశాలవిమానాలు ఎగరటం, అవీ నిఘా తరహా విమానాలైతే సదరు దేశాలపై దాడితో సమానమే. కంటికి కనిపించని వస్తువును కూడా పసిగట్టగల పరిజ్ఞానం అమెరికా వద్ద ఉంది. 1962లో భారత్-చైనా యుద్ధం తరువాత చైనామీద నిఘావేసేందుకు అమెరికా సిఐఏ-భారత గూఢచారసంస్థ ప్రతి నిధులు హిమాలయాల్లోని నందాదేవి శిఖరం మీద ప్లుటోనియం ఇంధనంతో పనిచేసే నిఘాపరికరాలను ఏర్పాటు చేసింది. తరువాత ఆ ప్లుటోనియం కారణంగా ఉత్తరాఖండ్ తదితరప్రాంతాల్లో వరదలు వచ్చినట్లు కొందరు చెప్పారు. అదేమైందో ఇప్పటికీ రహస్యమే. బెలూన్ ఉదంతంమీద అమెరికా చేసిన రచ్చ దానికే ఎదురుతన్నింది. ట్రంప్ హయాంలో అమెరికా గగనతలం మీద చైనాబెలూన్లు కనిపించినా కూల్చివేతవంటి పనులకు పాల్పడలేదు. అప్పుడెందుకు ఉపేక్షించారు, ఇప్పుడెందుకు రచ్చచేసి కూల్చివేశారు అంటే అంతర్గత రాజకీయాలప్రభావంతో పాటు చైనాతో వైరాన్ని కొనసాగించేందుకు ఒక సాకుగా దీన్ని తీసుకున్నట్లుగా కనిపిస్తోంది.

ఎగువ భద్రతో ఎడారి కానున్న రాయలసీమ

బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేయకున్నా 29.5 టిఎంసి నీటిని వినియోగించుకోవడానికి అప్పర్ భద్ర ప్రాజెక్ట్ ద్వారా కర్ణాటక ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కర్ణాటక ఎగువభద్ర ప్రాజెక్ట్‌తో రాయలసీమ ఎడారిగా మారుతుంది. ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా గుర్తించడంతో తెలుగు రాష్ట్రాలకు నీటి కష్టాలు తప్పవు. కర్ణాటకలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో రూ.5,300 కోట్లు కేటాయించడం రాయలసీమ నీటివసరులకు తీవ్రప్రమాదంగా మారింది. కర్ణాటకలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు రెండు రాష్ట్రాల్లోని కరువు ప్రాంతాల ప్రజలమధ్య వైషమ్యాలు సృష్టించడానికి కేంద్రం సిద్ధమైంది. మతాల మధ్య, ప్రాంతాల మధ్య నిరంతరం ఘర్షణలు రాజేసి అధికార పీఠాన్ని దక్కించుకోవడమే బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ రాజకీయ విధానం. నిత్యం కరువులకు గురవుతున్న రాయలసీమ జిల్లా ప్రజలకు కొంత మేరకైనా సాగు, తాగునీరు అందించే తుంగభద్ర ప్రాజెక్టుపైన నిర్మించే 'ఎగువ భద్ర' వల్ల రాయలసీమ ఎడారిగా మారనున్నది. కర్ణాటకలో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన బీజేపీ దొడ్డిదారిన అధికారాన్ని చేజిక్కించుకుంది. రాయలసీమ డిక్లరేషన్ అంటూ హడావుడి చేసిన ఆంధ్ర బీజేపీ నాయకులు మౌనముద్రలో వున్నారు. మన రాష్ట్ర నీటి వాటాను, ప్రభుత్వ అభ్యంతరాలను ఏ మాత్రం ఖాతరు చేయకుండా 'అప్పర్ భద్ర'కు అనుమతులు, నిధులు ఇస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వ నిరంకుశ చర్యలపై పోరాడాల్సిన వైసీపీ, టీడీపీ తక్షణ రాజకీయ ప్రయోజనాల కోసం తాపత్రయ పడుతున్నాయి. ప్రజలు ఇబ్బందికి గురైతే ప్రశ్నించడంతో ముందుంటానని ప్రతి సమావేశంలో జనసేనాని 'అప్పర్ భద్ర' పై ఎందుకని ప్రశ్నించరు? రాయలసీమ ఏమైతేనేమి! బీజేపీతో దోస్తీ చెడకుండా వుంటే మహాభాగ్యం అని ఈ పార్టీలు భావిస్తున్నాయి.

తుంగ, భద్ర నదులద్వారా వచ్చే నీటిని తుంగభద్ర డ్యామ్‌లో నిల్వచేసి అక్కడి నుండి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రాలకు దామాషా ప్రకారం పంపిణీ జరిగింది. కర్ణాటకలో ప్రస్తుతం భద్రావతి నది పైభాగాన కర్ణాటక పశ్చిమ ప్రాంతంలో 'అప్పర్ భద్ర' మేజర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. తుంగ, భద్ర నదుల నుండి నీటిని తోడుకోవడం ద్వారా కర్ణాటకలోని వెనుకబడిన చిత్రదుర్గ, చిక్‌మంగళూరు, దావణగెరె, తుముకూరు జిల్లాల్లో దాదాపు 2,25,515 హెక్టార్లకు సాగునీరు అందించడానికి ఈ ప్రాజెక్టును రూపకల్పన చేశారు. ఖరీఫ్ సీజన్‌లో నికరమైన నీటిని ఈ జిల్లాలకు అందించడం, భూగర్భ జలాలను అభివృద్ధిచేయడం, తాగునీటికోసం 367 చెరువులను 50శాతం సామర్థ్యంతో నింపడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలుగా కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించింది. 2018-19 ధరల ప్రకారం ఈ ప్రాజెక్టు అంచనా రూ.21,473.67 కోట్లు. ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విన్నవించడం, కేంద్రం ఆమోదించడం జరిగింది. కృష్ణా బేసిన్‌లో భాగంగావున్న తుంగభద్ర డ్యామ్‌పై దిగువనున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అభిప్రాయాలను, అభ్యంతరాలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. రెండు దశల్లో పూర్తి చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మొదటి దశలో 17.4 టీఎంసీలు, రెండవ దశలో 29.9 టీఎంసీల నీటిని కర్ణాటక తుంగభద్ర డ్యామ్‌లోకి రాకుండా తోడేసు కుంటుంది. ఆ మేరకు దిగువనున్న హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి, పోతిరెడ్డి పాడు, రాజోలిబండ డైవర్షన్‌స్కీమ్ కింద ఉన్న ఆయకట్టు పూర్తిగా నష్టపోతుందని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో తీవ్ర అభ్యంతరాలు పెట్టాయి. చట్టాలమీద, ప్రజాస్వామ్య వ్యవస్థమీద ఏమాత్రం గౌరవంలేని బీజేపీ ఏకపక్షంగా 'అప్పర్ భద్ర' నిర్మాణానికి సిద్ధమైంది. ఈ నిర్ణయం తీసు కోవడం వెనుక కర్ణాటకలోని కరువు ప్రాంతాలను అభివృద్ధి చేయడంకంటే ఈ ప్రాజెక్టు గురించి నాలుగు జిల్లాల్లో ప్రచారం చేసుకొని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ లబ్ధి పొందడమే ప్రధాన అంశంగా ఉంది.

అతీగతీ లేని రాయలసీమ ప్రాజెక్టులు

పాలకుల నిర్లక్ష్యం కారణంగానే సిద్దేశ్వరం అలుగు నిర్మాణం జరగడం లేదు. కృష్ణా, తుంగభద్ర నదులలో నీరు ఉన్నా ప్రతియేటా రాయలసీమకు కరువు తప్పడంలేదు. ప్రభుత్వాల ప్రకటనలు, బూటకపు

వాగ్దానాలకే పరిమితమయ్యారు. రాయలసీమలోని ఎనిమిది జిల్లాలలో సిద్దేశ్వరం అలుగు చట్టబద్ధ నీటిహక్కులు సాధించేవరకు పోరాడాల్సిన అవసరంఉంది. గ్రామ, మండల, జిల్లా స్థాయిలలోని అన్ని రైతుసంఘాలు, ప్రజాసంఘాల సమన్వయంతో ప్రజలను కలుపుకునే ఉద్యమం చేయాలి. సిద్దేశ్వరం రాయలసీమ ప్రజల చిరకాల స్వప్నం. దాదాపు శతాబ్దంపాటు పాలకుల నిర్లక్ష్యానికి సజీవసాక్ష్యం. 1911-12 ప్రాంతంలో ఆంగ్లేయుల కాలంలో మెకన్ జి సిఫార్సుల మేరకు సిద్దేశ్వరం సర్వేచేసి నిర్మాణానికి అంగీకారం తెలిపారు. తదనంతరం 1958 ప్రాంతంలో భారత ప్రణాళిక కమిషన్ పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. రాయలసీమకు 18లక్షల ఎకరాలకు, నాటి తమిళనాడుకు 5లక్షల ఎకరాలకు మొత్తం 22 లక్షల ఎకరాలకు సాగునీరుఅందేలా దాదాపు 250టిఎంసిల సామర్థ్యంతో ప్రాజెక్ట్‌ను రూపొందించారు. అదే జరిగి ఉంటే నేడు రాయలసీమకు 250 టిఎంసిల నికరజలాలు హక్కుగా మారి ఉండేది. సర్వతోముఖాభివృద్ధి జరిగేది. రాయలసీమకు నికరజలాల కేటాయింపులో అన్యాయం జరిగింది. అదే సందర్భంలో ఉన్న 133.7 టిఎంసిలలో కనీసం సగంనీటిని వాడుకోలేక పోతున్నాము. ప్రాజెక్టులవారిగా పరిశీలిస్తే..

1.తుంగభద్ర హైలెవల్ కెనాల్‌కిఉన్న 32.5 టిఎంసిలలో 17,18 టిఎంసి లు వాడుకుంటున్నాము. 2.ఎల్ఎల్సీ 29.5టిఎంసిలలో 11 టిఎంసిలు మాత్రమే వాడుకుంటున్నాము. 3. కెసి కెనాల్‌కు 39.9టిఎంసిలు ఉండగా ప్రభుత్వం కాకిలెక్కలు చెప్పి 50,60 టిఎంసిలు వాడుకున్నట్లు చూపి స్తున్నారు. కాని వాస్తవంగా 15 టిఎంసి లు మాత్రమే వాడు కుంటున్నాము. 4. బైరవాని తిప్ప 4.9 టిఎంసిలలో కేవలం 0.5 టిఎంసి లు వాడుకుంటున్నాము. 5. ఎస్ఆర్బీసీలో 19టీఎంసిలు ఉన్నా అందులో ఉపయోగించుకుంటున్నది 7,8 టిఎంసిలు మాత్రమే. స్థూలంగా చెప్పాలంటే సీమకు అధికారికంగా, హక్కుగా ఉన్న 133.7 టిఎంసిలలో మనం దాదాపు సగం అంటే 65 టిఎంసిలను వాడుకోవడంలేదు. దీని ఖరీదు వరిపంట అయితే కనీసం 5,6 లక్షల ఎకరాలు, అదే డ్రిప్ లాంటి వ్యవసాయం అయితే 13 లక్షల ఎకరాలు పంట నీటిని వాడుకోలేని పరిస్థితి. ఇవికాక శ్రీశైలంలోని క్యారి ఓవర్ క్రింద 60టిఎంసిలు, పట్టి సీమ నిర్మాణంద్వారా 45 టిఎంసిలు, పులిచింతల ద్వారా ఒప్పందం మేరకు 54 టిఎంసిలను మనం వాడుకోవాలి. అంటే దాదాపు 159 టిఎంసి ఇంకా రాయలసీమ వాడుకోవడానికి అవకాశంఉంది. అధికారికంగా ఉన్న 133.7 టిఎంసిలనే వాడుకునే ఏర్పాట్లు లేనపుడు ఇంకా అవకాశం ఉన్న 159 టిఎంసిలను ఎలా వాడుకోవాలి. రెండు కారణాల వలన సీమప్రాంతం నీటిని వాడుకోలేక పోతుంది. 1. నీటిని నిల్వ చేసుకునే ఏర్పాట్లు తగినంతగా సీమలో లేవు. 2. అవకాశం ఉన్న శ్రీశైలంలో 854 అడుగుల ఎత్తుకు నీటిని ఉంచకుండా 69 జీఓ ద్వారా 834 అడుగుల వరకు నీటిని కృష్ణా డెల్టాకు తీసుకు వెళ్లడం వలన సీమకు నీటి కష్టాలు వచ్చాయి. అందుకే జీఓ నెం.69ని రద్దుచేసి శ్రీశైలం నీటి మట్టాన్ని 854 అడుగులు ఉండేలా చూడాలి.

డా. యం.సురేష్ బాబు
ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు, సెల్:9989988912

30 లక్షల మందికి ముప్పు

ప్రపంచవ్యాప్తంగా కోటిన్నర మంది

జాబితాలో పాకిస్తాన్, చైనా, పెరూ

హిమనదీయ సరస్సులపై అధ్యయనం

న్యూఢిల్లీ: భారతదేశంలో 30 లక్షల మంది ప్రజలు హిమనదీయ సరస్సుల వరదల కారణంగా ప్రమాదంలో ఉన్నారని, ప్రపంచంలో బహిర్గతం చేయబడిన వారిలో ఇదే అత్యధిక సంఖ్య అని కొత్త అధ్యయనం పేర్కొంది. బ్రిటన్‌లోని న్యూకాజిల్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల నేతృత్వంలోని అంతర్జాతీయ బృందం చేసిన అధ్యయనం గ్లేసియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్స్ (జీఎల్ఓఎఫ్-గ్లోఫ్) అత్యధిక ప్రమాదం ఉన్న ప్రాంతాలపై ఇదే మొదటి ప్రపంచ అంచనా. ఈ అధ్యయనం నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో మంగళవారం ప్రచురితమైంది. ఇది హిమనదీయ సరస్సుల వల్ల కలిగే వరదలకు ప్రపంచవ్యాప్తంగా కోటిన్నర మంది ప్రజలు ప్రమాదంలో ఉన్నారని అంచనా వేసింది. ఉపశమనానికి ప్రాధాన్యత గల ప్రాంతాలను గుర్తించిన పరిశోధకులు, ప్రపంచవ్యాప్తంగా బహిర్గతమయ్యే జనాభాలో సగానికి పైగా కేవలం నాలుగు దేశాలలో మాత్రమే ఉన్నారని, అవి భారతదేశం, పాకిస్తాన్, పెరూ, చైనా అని వివరించింది. భారతదేశం, పాకిస్తాన్‌లో అత్యధిక సంఖ్యలో ప్రజలు ముప్పు బారిన పడతారని, ఈ సంఖ్య దాదాపు 30 లక్షలు, 20 లక్షల మంది ప్రజలు లేదా మొత్తం ప్రపంచ మొత్తంలో మూడింట ఒక వంతు అని పేర్కొంది. అయితే ఐస్‌లాండ్‌లో అతి తక్కువ (260 మంది) ఉన్నారు. వాతావరణం వేడెక్కుతున్నప్పుడు, హిమానీనదాలు తిరోగమనం చెందుతాయి. అప్పుడు హిమానీనదం ముందు భాగంలో కరిగే నీరు ఒక సరస్సుగా ఏర్పడుతుంది. ఈ సరస్సులు అకస్మాత్తుగా పేలవచ్చు. వేగంగా ప్రవహించే గ్లోఫ్‌లను సృష్టించగలవు. ఇది అసలు ప్రాంతం నుంచి చాలా దూరం, కొన్ని

సందర్భాల్లో 120 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం వరకు వ్యాపిస్తుంది. గ్లోఫ్‌లు అత్యంత విధ్వంసకరం. ఆస్తి, మౌలిక సదుపాయాలు, వ్యవసాయ భూమిని దెబ్బతీస్తాయి. గణనీయమైన జీవిత నష్టానికి దారి తీయవచ్చు. ఫిబ్రవరి 2021లో ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో జరిగిన గ్లోఫ్ కారణంగా సంభవించిన వరదల కారణంగా దాదాపు 80 మంది మరణించగా, చాలా మంది గల్లంతయ్యారు. వాతావరణ మార్పుల ఫలితంగా 1990 నుంచి హిమనదీయ సరస్సుల సంఖ్య వేగంగా పెరిగింది. అదే సమయంలో ఈ పరివాహక ప్రాంతాల్లో నివసించే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. పరిశోధనా బృందం ప్రపంచవ్యాప్తంగా 1,089 హిమనదీయ సరస్సు పరీవాహక ప్రాంతాలను, వాటిలో 50 కిలోమీటర్లలోపు నివసించే వ్యక్తుల సంఖ్యను, అలాగే ఆ ప్రాంతాలలో అభివృద్ధి స్థాయి, ఇతర సామాజిక సూచికలను గ్లోఫ్‌లు దుర్బలత్వానికి గుర్తులుగా పరిశీలించింది.

వారు ప్రపంచ స్థాయిలో గ్లోఫ్‌ల నుంచి నష్టానికి గల సంభావ్యతను లెక్కించడానికి, ర్యాంక్ చేయడానికి, అలాగే వరదలకు సమర్థవంతంగా ప్రతిస్పందించే సమాజ సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఈ సమాచారాన్ని ఉపయోగించారు. హిమనదీయ సరస్సుకి 50 కి.మీ లోపల కోటిన్నర మంది ప్రజలు నివసిస్తున్నారని, కిర్గిజ్‌స్థాన్ నుంచి చైనా వరకు టిబెటన్ పీఠభూమిని ఆవరించి ఉన్న హై మౌంటైన్ ఆసియా అత్యధిక గ్లోఫ్ ప్రమాదాన్ని కలిగి ఉందని, 93 లక్షల మంది ప్రజలు ప్రమాదంలో ఉన్నారని అధ్యయనం వివరించింది. అండీస్‌లోని హిమనదీయ సరస్సుల నుంచి వచ్చే ప్రమాదంపై సాపేక్ష పరిశోధన లేకపోవడాన్ని పరిశోధకులు సూచిస్తున్నారు. ఇది దక్షిణ అమెరికా పశ్చిమ వైపున నడుస్తుంది. ఇది ప్రపంచంలోని పొడవైన పర్వత శ్రేణులలో ఒకటి. హిమనదీయ సరస్సులకు సమీపంలో నివసించే అధిక సంఖ్యలో ప్రజలు, గ్లోఫ్ ప్రభావాన్ని తట్టుకునే వారి సామర్థ్యం తగ్గడం వల్ల ఈ ప్రాంతంలో స్థానిక స్థాయిలో సంభావ్య గ్లోఫ్ ప్రమాదాన్ని బాగా అర్థం చేసుకోవడానికి తదుపరి పరిశోధన తక్షణమే అవసరమని వారు గుర్తించారు. 'హిమనదీయ వరదల నుంచి ఏ ప్రాంతాలు పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయో అర్థం చేసుకోవడం మరింత లక్ష్యంగా, సమర్థవంతమైన విపత్తు నిర్వహణ చర్యలను అనుమతిస్తుంది. ఈ ముఖ్యమైన సహజ ప్రమాదం ఫలితంగా దిగువన ఉన్న మౌలిక సదుపాయాలకు నష్టాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది' అని న్యూకాజిల్ విశ్వవిద్యాలయంలో భౌతిక భూగోళశాస్త్రం ప్రధానాధిపతి, అధ్యయనం సహ రచయిత రాచెల్ కార్ చెప్పారు.

లక్నో పేరు త్వరలో మారుస్తాం: యూపీ డిప్యూటీ సీఎం

లక్నో: లక్నో అనేది లక్ష్మణ్ సిటీ అనే విషయం అందరికీ తెలిసిందేనని, పేరు మార్పునకు సంబంధించిన అన్ని విషయాలను త్వరలో ప్రభుత్వం తెలియజేస్తుందని యూపీ ఉపముఖ్యమంత్రి బ్రిజేష్ పాఠక్ చెప్పారు. బదోహిలో బుధవారం పర్యటించిన మంత్రి వివిధ పథకాలు, అభివృద్ధి పనుల ప్రగతిని సమీక్షించారు. సురియావా ప్రాంతంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్నో పేరు మార్చాలంటూ బీజేపీ ఎంపీ సంగమ్ లాల్ గుప్తా డిమాండ్‌పై మంత్రి ప్రకటన చేశారు. లక్నో పేరును 'లక్ష్మణ్ నగర్'గా మార్చేందుకు తదుపరి చర్చలు జరుగుతున్నట్టు సంకేతాలిచ్చారు. మరోవైపు, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై బ్రిజేష్ పాఠక్ విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీ మానసిక స్థితి పూర్తిగా అదుపు తప్పిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలో ఉన్నా అవినీతితో తలమునకలయ్యేదన్నారు. బొగ్గు కుంభకోణాలు, కామన్‌వెల్త్ కుంభకోణం వంటి ఎన్నో కుంభకోణాలు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే చోటుచేసుకున్నాయని చెప్పారు. కాంగ్రెస్ కుటుంబ పార్టీ అన్నారు. కాగా, ఉత్తరప్రదేశ్ రాజధాని నగరం లక్నోను లఖన్‌పూర్‌గా కానీ, లక్ష్మణ్‌పూర్‌గా కానీ మార్చాలని బీజేపీ ఎంపీ సంగమ్ లాల్ గుప్తా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరారు.

మెహబూబా ముఫ్తీ అరెస్టు

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లోని పీడీపీతో పాటు ఇతర పార్టీలు కలిసి బుధవారం లోయలో ఇళ్ల కూల్చివేతలను తీవ్రస్థాయిలో నిరసించారు. నిరసనలో పాల్గొన్న కారణంగా పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ అరెస్టుకు గురయ్యారు. ఆమె ఢిల్లీ పోలీసుల నిర్బంధంలో ఉన్నారు. పోలీసుల తీరును జమ్ముకశ్మీర్ నాయకులు తీవ్రంగా ఖండించారు. బీజేపీ తన అధికారాన్ని దుర్వినియోగిస్తోందని మెహబూబా మంగళవారం ఘాటుగా విమర్శలు చేశారు. పాలస్తీనా, అఫ్ఘన్ కంటే కశ్మీర్ పరిస్థితి అధ్వాన్నంగా మారుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. స్థానికుల ఇళ్లు కూల్చివేసేందుకు బుల్డోజర్లు ఉపయోగిస్తున్నారు. దీనివల్ల కలిగే ప్రయోజనం ఏమిటని ఆమె ప్రశ్నించారు. పీడీపీతో సహా ఇతర పార్టీల నేతలు కూడా బీజేపీ చర్యలను విమర్శించారు.

లోక్‌సభను తప్పుదోవ పట్టించారు

రాహుల్‌పై కేంద్ర మంత్రి ఎదురుదాడి

న్యూఢిల్లీ: గాంధీ కుటుంబం అవినీతికి పాల్పడుతోందని, బెయిల్‌పై ఉన్నవారు ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ సభ్యుడు రవిశంకర్ ప్రసాద్ బుధవారం ఆరోపించారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై లోక్‌సభలో ప్రసాద్ మాట్లాడుతూ మంగళవారం రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు 'నిరాధారమైనవి, సిగ్గుచేటని, అబద్ధాలతో నిండి ఉన్నాయని, నిరుత్సాహ భావన నుంచి వచ్చాయి' అని అన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ మంగళవారం హిండెన్‌బర్గ్ నివేదికను ప్రస్తావిస్తూ, ప్రభుత్వంపై దాడి చేశారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గౌతమ్ అదానీ సంపద ఉల్కాపాతంగా పెరిగిందని, ప్రపంచ ధనవంతుల జాబితాలో అతను 609వ స్థానం నుంచి రెండవ స్థానానికి ఎగబాకాడని తెలిపారు. రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ 'బెయిల్‌పై విడుదలై ప్రస్తుతం విచారణను ఎదుర్కొంటున్న వారు (నేషనల్ హెరాల్డ్ కేసులో) నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు' అని అన్నారు. ప్రజలు రెండుసార్లు నరేంద్ర మోదీని ప్రధానిగా ఎన్నుకున్నారని, 2024లో మళ్లీ అదే చేస్తారన్న వాస్తవాన్ని గాంధీ అంగీకరించలేకపోయారని అన్నారు. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాజస్థాన్, చత్తీస్‌గఢ్, కేరళ రాష్ట్రాల్లో కూడా అదానీ గ్రూప్ పెట్టుబడులు పెట్టిందని చెప్పారు. యూపీఏ హయాంలో కూడా ఈ గ్రూపు విదేశీ పెట్టుబడులు పెట్టిందని, విదేశాల్లోని అదానీ ఆస్తులకు సంబంధించి గాంధీ చేసిన ఆరోపణలపై మాట్లాడుతూ 'రాహుల్ గాంధీకి భారతీయ వ్యాపారాల వృద్ధి సమస్య ఉంది. మోదీ ప్రభుత్వంలో పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు వ్యాపారాలు నిజాయితీగా పెరుగుతున్నాయి. కమీషన్లు, లావాదేవీలు ఆగిపోయాయి. అందుకే కాంగ్రెస్ పార్టీకి సమస్య ఉంది' అని అన్నారు. కాంగ్రెస్ పాలనలో బొగ్గు, ఆదర్శ్ హౌసింగ్ కుంభకోణంతో పాటు 2జి స్పెక్ట్రమ్ కేటాయింపులు, కామన్వెల్త్ గేమ్స్‌లో అవినీతికి పాల్పడిందని బీహార్‌కు చెందిన బీజేపీ నాయకుడు అన్నారు. 'అవినీతిలో మునిగిన కుటుంబం అభివృద్ధిపై దృష్టిసారించిన మోదీ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తోంది' అని ప్రసాద్ పేర్కొంటూ గాంధీ సభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. మంగళవారం సభలో గాంధీ చేసిన కొన్ని వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు.

ఇందిర శకం వైపు మోదీ

అసదుద్దీన్ ఒవైసీ విమర్శ

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వం 'ఇందిరా గాంధీ శకాన్ని' తిరిగి తీసుకువస్తోందని ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ బుధవారం అన్నారు. న్యాయమూర్తుల నియామక ప్రక్రియపై కొనసాగుతున్న యుద్ధాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు రాజ్యాంగ 'ప్రాథమిక నిర్మాణం'పై వ్యాఖ్యానించడంపై ఆందోళన లేవనెత్తారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో పాల్గొన్న ఒవైసీ... మైనారిటీల కోసం ప్రభుత్వం తగినంతగా చేయడం లేదని ఆరోపించారు. భారతదేశం-చైనా సరిహద్దు పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. 'రాజ్యాంగ పదవులపై ఉన్న వ్యక్తులు ప్రాథమిక నిర్మాణంపై వ్యాఖ్యానిస్తున్నారు... న్యాయ మంత్రి కొలీజియంపై వ్యాఖ్యలు చేశారు... ఎన్‌జేఏసీ (జాతీయ న్యాయ నియామకాల కమిషన్) బిల్లు వచ్చినప్పుడు అది రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణానికి విరుద్ధమని చెప్పిన ఏకైక ఎంపీని నేను' అని ఒవైసీ అన్నారు. 'ఇందిరా గాంధీ నుంచి మీరు గుణపాఠం నేర్చుకోవాలి. న్యాయవ్యవస్థ తనను అనుసరించాలని ఇందిరాగాంధీ అన్నారు. ఇప్పుడు ప్రధాని మోదీ న్యాయవ్యవస్థ తనకు విధేయంగా ఉండాలని చెబుతున్నారు. మీరు అదే ఇందిరా గాంధీ శకాన్ని తిరిగి తీసుకువస్తున్నారు' అని ఆయన అన్నారు. మైనారిటీల కోసం ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయడం లేదని, మైనారిటీల బడ్జెట్‌లో 40 శాతం కోత పెట్టారని ఒవైసీ ఆరోపించారు. 'జనాభాలో 19 శాతం ఉన్న మైనారిటీల గురించి రాష్ట్రపతి ప్రసంగంలో కూడా ప్రస్తావించలేదు.. నరేంద్ర మోదీ ప్రభుత్వం ముస్లిం పిల్లలు చదువుకోవాలని కోరుకోవడం లేదు. వారు పేదరికానికి గురవుతున్నారు' అని అన్నారు. ఒవైసీ కూడా బిల్కిస్ బానో గురించి ప్రస్తావించారు. 'ఆమె 20 సంవత్సరాలుగా పోరాడుతోంది.

కానీ ఆమె పేరు బిల్కిస్ బానో అయినందున ఆమెకు న్యాయం నిరాకరించారు' అని తెలిపారు. భారతదేశం-చైనా సరిహద్దు పరిస్థితి గురించి మాట్లాడుతూ ప్రభుత్వం 'చైనాను చూసి భయపడుతోంది' అని ఆరోపించారు. 'ప్రధాన మంత్రి చైనా పేరు పెట్టుకుంటారా? 65 పెట్రోలింగ్ పాయింట్లలో 26 పెట్రోలింగ్ పాయింట్లలో భారత్ పెట్రోలింగ్ చేయలేదని చెప్పారు. మీరు చైనాను చూసి భయపడుతున్నారు. వియోగం జరిగింది. డి-ఎస్కలేషన్, డి-ఇండక్షన్ ఎప్పుడు జరుగుతుంది' అని ఒవైసీ ప్రశ్నించారు.

నామినేటెడ్ సభ్యులకు ఓటు హక్కు లేదు

ఎల్‌జీ, ప్రిసైడింగ్ అధికారులకు సుప్రీం నోటీసు

న్యూఢిల్లీ: ఆప్, బీజేపీ మధ్య యుద్ధానికి సుప్రీంకోర్టు కళ్లెం వేసింది. వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తున్న ఢిల్లీ మేయర్ ఎన్నికకు ఉన్న అడ్డంకులను సుప్రీంకోర్టు తొలగించింది. ఎంసీడీ మేయర్ ఎన్నికలను అత్యవసరంగా పూర్తి చేయాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ మేయర్ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్, ఆప్ ఉమ్మడి పిటిషన్‌పై లెఫ్టినెంట్ గవర్నరు, ప్రొటెం ప్రిసైడింగ్ అధికారి కార్యాలయాలకు సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. సోమవారం లోగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. ఆప్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్థివాలాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎల్‌జీ నామినేటెడ్ సభ్యులకు ఓటు వేయడానికి అనుమతి లేదని ధర్మాసనం స్పష్టంచేసింది. ఢిల్లీ మేయర్ ఎన్నిక ముచ్చటగా మూడుసార్లు వాయిదా పడింది. ఢిల్లీ మున్సిపల్ యాక్ట్-1957 ప్రకారం తొలి మున్సిపల్ సమావేశాల్లో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక పూర్తి కావాల్సి ఉంది. అయితే ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ మధ్య వాగ్వాదం చోటుచేసుకుని గత నెల 6, 24 తేదీల్లో జరిగిన రెండు సమావేశాలు వాయిదా పడ్డాయి. ఈ నెల 6న తిరిగి ఎన్నిక నిర్వహించేందుకు ఎల్జీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కానీ మరోమారు ఆప్, బీజేపీ మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో మళ్లీ వాయిదా పడింది. కాగా, కీలకమైన 18 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులలో ఆరుగురుని గత సోమవారం అంటే 6వ తేదీన ఎన్నుకోవాల్సి ఉంది. మిగిలిన 12 మందిని జోనల్ ఎలక్షన్స్ ద్వారా ఎన్నుకుంటారు. కాగా, కీలకమైన ఆరుగురు సభ్యుల ఎన్నికలో మూడు సీట్లు ఆప్ గెలుచుకోనుండగా, బీజేపీ రెండు సీట్లు దక్కించుకోనుంది. కీలకమైన ఆరో సీటు విషయంలోనే సభలో గందరగోళం తలెత్తింది. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా నామినేట్ చేసిన 10 మంది ఢిల్లీ కౌన్సిలర్లు ఓటు వేసేందుకు అనుమతించడం ఆప్‌కు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. నామినేట్ సభ్యులను ఓటింగ్‌కు అనుమతిస్తే బీజేపీకి ఆ సీటు దక్కే అవకాశం ఉంది. ఇది ఆప్‌కు ఆందోళన కలిగిస్తోంది. దీనిపై ఆప్ నిరసనకు దిగింది. 250 స్థానాలున్న ఢిల్లీ మున్సిపాలిటీకి గత డిసెంబర్ 4న ఎన్నికలు జరగగా డిసెంబర్ 7న ఫలితాలు వెలువడ్డాయి. 134 సీట్లతో మేయర్ స్థానాన్ని దక్కించుకునేందుకు అవసరమైన మేజిక్ ఫిగర్‌ను ఆప్ కైవసం చేసుకుంది. బీజేపీ 104 వార్డులు గెలుచుకుని రెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ 9 సీట్లు గెలుచుకుంది. ఆప్ తరపున మేయర్ అభ్యర్థిగా షెల్లీ ఒబెరాయ్ పోటీ పడుతున్నారు. బీజేపీ తరపున రేఖా గుప్తా పోటీ చేస్తున్నారు. డిప్యూటీ మేయర్ పదవికి ఆప్ తరపున అలెయ్ మొహమ్మద్ ఇక్బాల్, బీజేపీ నుంచి కమల్ బాగ్రి పోటీ పడుతున్నారు. మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు స్టాడింగ్ కమిటీకి ఆరుగురు సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ ఆరుగురి ఎన్నిక విషయంలోనే ఆప్, బీజేపీ మధ్య ఘర్షణ జరుగుతోంది.

అదానీ ఆస్తులు జాతీయం చేయాలి

- వేలం వేసి బాధితులకు పంచాలి
- నిర్మలమ్మ బడ్జెట్ ఓ బోగస్: సుబ్రమణ్యస్వామి

చెన్నై: అమెరికా పరిశోధక సంస్థ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికతో అదానీ గ్రూపు షేర్లు తీవ్ర పతనమయ్యాయి. ఈ కుంభకోణంపై దర్యాప్తు చేయాలని అటు పార్లమెంటులోనూ విపక్ష పార్టీలు ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి. ఈ క్రమంలో అదానీ వ్యవహారంపై కేంద్ర మాజీమంత్రి, బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్య స్వామి కీలక వ్యాఖ్యలు చేశారు. అదానీ గ్రూపు ఆస్తులను కేంద్ర ప్రభుత్వం జాతీయం చేసి.. వాటిని వేలం వేయాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పీటీఐ వార్త సంస్థకు ఆయన గురువారం ఇంటర్వ్యూ ఇచ్చారు. అదానీ వ్యవహారం, కేంద్ర బడ్జెట్, ముషారఫ్ మరణంపై సానుభూతి వంటి అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. అదానీ గ్రూపు ఆస్తులన్నీ జాతీయం చేసి వాటిని వేలం వేయాలని సుబ్రమణ్యస్వామి డిమాండ్ చేశారు. వచ్చిన నగదును ఇందులో నష్టపోయిన వారికి సహాయంగా అందజేయాలన్నారు. అదానీతో ఒప్పందాలు లేవని కాంగ్రెస్ చెబుతోందని, కానీ, అదానీతో ఒప్పందాలు ఉన్న వ్యక్తుల గురించి తనకు తెలుసన్నారు. అదానీ వ్యవహారంలో బీజేపీ తన పవిత్రతను నిరూపించుకోవాలని కోరుకుంటున్నానని చెప్పారు. ప్రధాని మోదీ ఏదో దాచిపెడుతున్నారని ప్రజల్లో ఒక భావన ఉందని, దానిపై స్పష్టతనిచ్చే బాధ్యత ప్రభుత్వానిదేనని సుబ్రమణ్యస్వామి అభిప్రాయపడ్డారు. పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు ముషారఫ్ మరణంపై సానుభూతి వ్యక్తం చేయడం పట్ల ఎన్నో విమర్శలు వచ్చాయని, కార్గిల్ యుద్ధానికి కారణమైన వ్యక్తి గురించి అలా ఎలా మాట్లాడుతారని ప్రశ్నిస్తున్నారని, కార్గిల్ యుద్ధం జరిగే సమయంలో (1999) పాకిస్తాన్ ప్రధానిగా నవాజ్ షరీఫ్ ఉన్నారని గుర్తుచేశారు. షరీఫ్ ఆదేశాలకనుగుణంగా సైనికాధిపతిగా ముషారఫ్ తన సైనికులకు ఆదేశాలిచ్చారన్నారు. అయితే, నిబంధనలు పక్కనబెట్టి పాకిస్తాన్‌లో అడుగుపెట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. నవాజ్ షరీఫ్‌తో కలిసి భోజనం చేశారని, కార్గిల్ యుద్ధానికి ముఖ్య కారకుడైన ఆయనతో కలవడం పట్ల ఎందుకు మాట్లాడరని ఆయన ప్రశ్నించారు. ముషారఫ్ తనకు వ్యక్తిగతంగా తెలుసని, పాకిస్తాన్‌లో, భారత్‌లో ఎన్నోసార్లు ఆయనను కలిశానన్నారు. సైనిక తిరుగుబాటు తర్వాత దేశాధ్యక్షుడైన ముషారఫ్.. భారత్‌తో కలిసి పనిచేసేందుకు సుముఖంగా ఉన్నట్లు తనతో చెప్పారన్నారు. తాలిబన్లను అంతం చేసేందుకు అమెరికాతో కలిసి పనిచేశారని, ముషారఫ్ విషయంలో తనను ప్రశ్నించే ముందు.. కార్గిల్ యుద్ధానికి ముఖ్య కారకుడైన నవాజ్ షరీఫ్ ఇంటికి మోదీ ఎందుకు వెళ్లారనే పశ్నకు నెటిజన్లు



సమాధానమివ్వలేరని సుబ్రమణ్యస్వామి వ్యాఖ్యానించారు. మరోవైపు, నిర్మలా సీతారామన్ తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ ఓ బోగస్ అని సుబ్రమణ్యస్వామి మండిపడ్డారు. కొన్నేళ్లుగా దేశ వృద్ధి రేటు 3 నుంచి 4 శాతం మాత్రమే ఉంటోందని, కానీ, వచ్చే ఏడాదికి 6.5 శాతం వృద్ధి రేటు ఉంటుందని మంత్రి చెప్పారని, 2019 నుంచి లేనిది ఇప్పుడెలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. వ్యవసాయం, పరిశ్రమలకు అందులో ప్రాధాన్యతే లేదన్నారు. ప్రభుత్వానికి ఎటువంటి వ్యూహం లేదని బడ్జెట్ స్పష్టం చేస్తోందన్నారు.

త్రిపుర అభ్యర్థుల్లో 45మంది కోటీశ్వరులు

అగర్తల: త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 16న జరగనున్నాయి. అయితే పోటీ చేస్తున్న మొత్తం 259 మంది అభ్యర్థుల్లో 45 మంది కోటీశ్వరులేనని ఓ నివేదిక పేర్కొంది. ఇందులో అత్యధికంగా అధికార బీజేపీకి 17 మంది అభ్యర్థులు ఉండగా, తిప్ర మోతలో తొమ్మిది మంది, సీపీఎంకు చెందిన ఏడుగురు అభ్యర్థులుగా ఉన్నారని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) అనే స్వచ్ఛంద సంస్థ నివేదిక వెల్లడించింది. ఇక కాంగ్రెస్ అభ్యర్థుల్లో ఆరుగురు, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన నలుగురు, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కూడా కోటీశ్వరులేనని నివేదిక పేర్కొంది. చరిలం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీకి చెందిన ఉప ముఖ్యమంత్రి జిష్ణు దేవ్ వర్మ రూ.15.58 కోట్ల చర, స్థిరాస్తులతో అత్యంత సంపన్న అభ్యర్థిగా నిలిచినట్లు నివేదిక పేర్కొంది. తరువాతి స్థానంలో రూ. 13.90 కోట్ల ఆస్తులతో ముఖ్యమంత్రి మాణిక్ సాహా ఉన్నారు. సాహా టౌన్ బర్డోవాలి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. రూ.12.57 కోట్లతో తిప్ర మోతాకు చెందిన అభిజిత్ సర్కార్ మూడో సంపన్న అభ్యర్థిగా ఉన్నారు. ఇక మొత్తం అభ్యర్థులలో 41 (16%) మంది తమపై క్రిమినల్ కేసులున్నట్లు ప్రకటించారు. 2018 ఎన్నికల్లో 297 మంది అభ్యర్థుల్లో 22 (7%) మంది అభ్యర్థులు క్రిమినల్ కేసులను ప్రకటించారు. తాజా ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్‌కు చెందిన 13, బీజేపీకి చెందిన 9 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 43 మంది లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థుల్లో తొమ్మిది మంది (16%)పై క్రిమినల్ కేసులు ఉన్నాయి. మొత్తం 259 మంది అభ్యర్థుల్లో 65 మంది గ్రాడ్యుయేట్లు, 55 మంది 12వ తరగతి ఉత్తీర్ణులు, 39 మంది మెట్రిక్యులేట్లు ఉన్నారు. 36 మంది అభ్యర్థులు 8వ తరగతి ఉత్తీర్ణులు కాగా, తొమ్మిది మంది 5వ తరగతి ఉత్తీర్ణులయ్యారని ఏడీఆర్ నివేదిక వివరించింది.

లోక్‌సభలో ప్రజాస్వామ్యాన్ని తగలేశారు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి రాహుల్ గాంధీ పార్లమెంటులో చేసిన కొన్ని వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించడాన్ని కాంగ్రెస్ బుధవారం తీవ్రంగా తప్పుబట్టింది. లోక్‌సభలో ప్రజాస్వామ్యాన్ని తగలబెట్టారని విమర్శించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ మాట్లాడుతూ... 'ప్రధానితో సంబంధమున్న అదానీ మహా మెగా స్కాంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తొలగించడం ద్వారా లోక్‌సభలో ప్రజాస్వామ్యం దగ్ధమైంది. ఓం శాంతి' అన్నారు. మంగళవారం రాహుల్ గాంధీ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో మాట్లాడుతూ... 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గౌతమ్ అదానీ సంపద హఠాత్తుగా పెరిగిపోయిందని, ప్రపంచ సంపన్నుల జాబితాలో 609వ స్థానం నుంచి రెండో స్థానానికి చేరుకున్నారని . విమర్శించారు. దీనిపై బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ... ఆధారాల్లేని ఆరోపణలు చేయొద్దని తన వాదనలకు రాహుల్ గాంధీ రుజువును అందించాలని కోరారు. పార్లమెంటు వెలుపల బీజేపీ నాయకుడు రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ... రాహుల్ గాంధీ సిగ్గులేకుండా నిర్లక్ష్యంగా నిరాధార ఆరోపణలు చేశారని, కాంగ్రెస్, గాంధీ కుటుంబం దేశ ప్రతిష్ఠను మంట గలిపే అతిపెద్ద కుంభకోణాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

ప్రత్యేక నీలిరంగు జాకెట్ ధరించిన ప్రధాని

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం రాజ్యసభకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ ఆకర్షణీయమైన నీలి రంగు స్లీవ్‌లెస్ జాకెట్‌లో కనిపించారు. సాధారణంగా మోదీ అలాంటి వస్త్రధారణలోనే కనిపిస్తారు కానీ.. ఈ జాకెట్‌కు మాత్రం ప్రత్యేకత ఉంది. ఈ జాకెట్ ప్లాస్టిక్ బాటిళ్లను రీసైకిల్ చేయగా ఉత్పత్తయిన మెటీరియల్‌తో దీన్ని తయారు చేయడం విశేషం. ఇక ఆ జాకెట్ వివరాల్లోకి వెళితే... బెంగళూరు వేదికగా జరుగుతున్న 'ఇండియా ఎనర్జీ వీక్-2023' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ సోమవారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్.. మోదీకి ఈ అరుదైన బహుమతిని అందించింది. ఇది సుమారు 28 పెట్(పాలీఇథలిన్ టెరెప్తలేట్) బాటిళ్లను రీసైకిల్ చేసి తయారు చేసిన నీలం రంగు జాకెట్.

గవర్నర్ ప్రసంగంపై బీజేపీ ఎమ్మెల్యేల నిరసన

కోల్‌కతా: బీజేపీ ఎమ్మెల్యేల నిరసనల నడుమ పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ బుధవారం రాష్ట్ర అసెంబ్లీలో మొదటిసారి ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా బీజేపీ శాసనసభ్యులు మమతా బెనర్జీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభనుంచి బయటకు వెళ్లిపోయారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభ సూచికగా గవర్నర్ బోస్ తన ప్రసంగాన్ని ప్రారంభించిన కొద్ది నిమిషాల్లోనే, ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి నేతృత్వంలోని బీజేపీ ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. వాస్తవానికి సంబంధం లేని అంశాలతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రసంగాన్ని చదివినందుకు వారు గవర్నర్‌పై నిరసన వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలోని అత్యంత అవినీతి ప్రభుత్వాల్లో ఇదొకటి. ప్రసంగంలో అవినీతి కేసులు, టీఎంసీ నేతల అరెస్ట్‌ల ప్రస్తావన లేకపోవడంతో వాకౌట్ చేశాం' అని అధికారి మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. అసెంబ్లీ కార్యక్రమాలకు భంగం కలిగించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని టీఎంసీ చీఫ్ విప్ నిర్మల్ ఘోష్ విమర్శించారు. బీజేపీ వైఖరిని తీవ్రంగా ఖండించారు.

కశ్మీర్‌లో 187మంది ఉగ్రవాదులు హతం

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లో 2022లో మొత్తం 187 మంది ఉగ్రవాదులు హతమయ్యారని, 111 ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు నిర్వహించినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ బుధవారం రాజ్యసభలో తెలిపారు. 2022లో జమ్ముకశ్మీర్‌లో 125 మంది ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడ్డారని, 117 ఎన్‌కౌంటర్లు జరిగాయని రాయ్ చెప్పారు. ఇక 2021లో కశ్మీర్‌లో 180 మంది ఉగ్రవాదులు హతమయ్యారని, 95 ఉగ్రవాద వ్యతిరేక దాడులు జరిగాయని బీజేపీ సభ్యుడు సుశీల్ కుమార్ మోదీ లిఖితపూర్వకంగా అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాయ్ వివరించారు. 2021లో కేంద్రపాలిత ప్రాంతంలో మొత్తం 100 ఎన్‌కౌంటర్‌లు, 129 మంది ఉగ్రవాదులు చొరబడిన సంఘటనలు కూడా నమోదయ్యాయని మంత్రి పేర్కొన్నారు.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో మరో అరెస్టు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ అధికారులు మరింత దూకుడు పెంచారు. ఎమ్మెల్సీ కవిత మాజీ సహాయకుడు, ఆడిటర్ గోరంట్ల బుచ్చిబాబును సీబీఐ అధికారులు అరెస్ట్ చేసిన విషయం బయటకు వచ్చిన కొద్ది సేపటికే ఈడీ మరొకరి అరెస్టును ప్రకటించింది. ఢిల్లీకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ మల్హోత్రాను అరెస్ట్ చేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. మద్యం విధానంలో మార్పులలో ఆయన కీలకపాత్ర పోషించినట్లు అధికారులు చెబుతున్నారు. గౌతమ్ అల్హోత్రాను సీబీఐ ప్రత్యేక కోర్టులో ఈడీ అధికారులు హాజరుపరిచారు. గత రాత్రి మల్హోత్రాను ఈడీ కస్టడీలోకి తీసుకుంది. ఈ రోజు అధికారికంగా అరెస్టు చేసినట్లు ప్రకటించింది. గౌతమ్ మల్హోత్రాకు మద్యం వ్యాపారులతో సన్నిహిత వ్యాపార సంబంధాలు ఉన్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయని ఈడీ తెలిపింది.

ఓ రాజకీయ పార్టీకి చెందిన చాలామంది నేతలతో డబ్బు లావాదేవీలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయని ఈడీ వెల్లడించింది. మద్యం విధానం రూపకల్పన సమయంలో వ్యాపార లావాదేవీలు జరపడంతో పాటు రాజకీయ పార్టీకి చెందిన వారితో డబ్బు లావాదేవీల్లో గౌతమ్ మల్హోత్రాకు భాగస్వామ్యం ఉన్నట్లు ఈడీ వెల్లడించింది.

ఎగువ భద్రతో ఎడారే

సుప్రీం తీర్పుకు వ్యతిరేకం

అనంతపురం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రం ఎగువ భద్రా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణానికి వేల కోట్ల నిధులు మంజూరు చేసిందని, ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్ విమర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సీపీఐ అనుబంధ ఏపీ రైతుసంఘం అధ్వర్యంలో ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణంపై రాజకీయ పార్టీలు, రైతు, ప్రజాసంఘాల నాయకులతో సదస్సు జరిగింది. ఏపీ రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున అధ్యక్షతన జరిగిన సదస్సులో జగదీశ్, సాగునీటి ప్రాజెక్టుల నిపుణుడు లక్ష్మినారాయణ, కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, పుట్టపర్తి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా తుంగభద్రపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మిస్తోందని నాయకులు విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగితే రాయలసీమకు చుక్క నీరు వచ్చే పరిస్థితి ఉండదన్నారు. రాజోలు బండ ప్రాజెక్టు, శ్రీశైలం డ్యాంకు సైతం నీరు అందదన్నారు. అప్పర్ భద్రా వల్ల జరిగే నష్టాన్ని అంచనా వేసి రాష్ట్ర ప్రజలకు తెలిపేందుకు ఈనెల 13 నుండి 24 వరకు ఏపీ సాగునీటి ప్రాజెక్టుల కాల్వలపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులు పర్యటించనున్నామన్నారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌పై సుప్రీంకోర్టులో వ్యాజ్యం నడుస్తున్నందున ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం దుర్మార్గమని ఘాటుగా విమర్శించారు. కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి నిధులు కేటాయించడం సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధమని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ ప్రాజెక్టుల నిర్మాణంపై సీఎం జగన్ బీజేపీతో లాలూచీ పడి మౌనం వహించారని తూర్పారబట్టారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఎగువ భద్రాను పొగడటం సిగ్గు చేటన్నారు. కర్ణాటక ఎన్నికల ఎన్నికల కోసం కేంద్రం ఆ రాష్ట్రంపై ప్రేమ ఒలకబోస్తోందని నిందించారు. అప్పర్ భద్రాను అడ్డుకోకపోతే సీఎం జగన్ రాయలసీమ ద్రోహిగా నిలిచిపోతారని దుమ్మెత్తి పోశారు. అప్పర్ భద్రా నిర్మాణం ఆపేందుకు అన్ని రాజకీయ పార్టీలు, రైతు, ప్రజా సంఘాలు, ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాయలసీమకు భవిష్యత్తు ఉండాలంటే రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం కావాలన్నారు. సీపీఐ నాయకులు రామకృష్ణ, కేశవరెడ్డి, శ్రీరాములు, లింగమయ్య, మల్లికార్జున, రమణ, సంతోశ్ కుమార్, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, టీడీపీ నేత శివబాల, బీసీ నేత నరసింహులు, రైతుసంఘం నాయకులు పంచ రామకృష్ణ, ధనుంజయ, రమేశ్, అనంత రాముడు, రాము, బాష, సీపీఐ ఎంఎల్ నాయకుడు చంద్రశేఖర్, నాగరాజు, పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజు, రైతు, ప్రజా సంఘాల నాయకులు, వామపక్ష పార్టీలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయలసీమకు తీవ్ర అన్యాయం

కడప రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కర్ణాటకలో ఎగువ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి, దాని నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.5,300 కోట్ల నిధులను కేటాయిస్తూ రాయలసీమ రైతాంగానికి తీవ్ర అన్యాయానికి ఒడిగడితే, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మోదీ జపం చేస్తున్నాడని అఖిలపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కడప ప్రెస్ క్లబ్‌లో 'ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణం-రాయలసీమ నీటి సమస్యలు' అంశంపై ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.వి.సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎ.సత్తార్, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య, లోక్‌సత్తా పార్టీ నాయకులు కృష్ణయ్య, బీఎస్పీ నాయకుడు గుర్రప్ప, సీపీఎం (ఎంఎల్) నాయకులు రమణయ్య, సీఆర్‌వీ ప్రసాద్, దస్తగిరి రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కె.సి.బాదుల్లా, డీహెచ్‌పీఎస్ నాయకులు బందెల ఓబయ్య, మునయ్య, రైతు స్వరాజ్య వేదిక నాయకుడు శివారెడ్డి, రైతు సంఘం సీనియర్ నాయకులు పుల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్రాష్ట్ర నది వివాదాల చట్టం 1955 ప్రకారం, కృష్ణా నది నీటి వివాదాలపై ఏర్పాటయిన బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం 75 శాతం నీటి లభ్యత ఆధారంగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు 811 టీఎంసీలు, కర్ణాటకకు 734 టీఎంసీలు, మహారాష్ట్రకు 586 టీఎంసీలు కేటాయించిందని తెలిపారు. అయితే తర్వాత ఏర్పాటయిన బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నీటి లభ్యత ఆధారంగా వరద జలాలను కూడా లెక్కగట్టి మూడు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం వేసిన దావా నడుస్తోందని అన్నారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కర్ణాటక రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందడానికి, ఆ రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు ఎలాంటి కేటాయింపులు లేని ఎగువ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి రూ.22 వేల కోట్ల అంచనా వ్యయంతో ఈ వార్షిక బడ్జెట్‌లో మొదటి విడతగా రూ.5,300 కోట్ల నిధులను కేటాయించిందని తెలిపారు. పై భాగంలో ఈ ప్రాజెక్టు నిర్మించడం వల్ల దిగువ ప్రాంతంలోని రాయలసీమ రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని విభజన చట్టంలో స్పష్టంగా ఉన్నప్పటికీ, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా రాయలసీమ రైతుల నోట్లో దుమ్ము కొడుతూ కర్ణాటక-ఆంధ్ర రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టేందుకు బీజేపీ సర్కార్ కుట్రలు పన్నుతోందని అన్నారు. ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మిస్తే బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం తుంగభద్ర డ్యామ్ దిగువ భాగంలో ఉన్న నికర జలాలు కలిగిన ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ, రాజోలు బండ డైవర్షన్ స్కీమ్, కేసీ కెనాల్, మైలవరం, పులివెందుల బ్రాంచ్ కెనాల్ మొదలగు వాటికి నీరు అందక ఈ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేకంగా బ్రిజేష్ కుమార్ తీర్పు యథావిధిగా అమలు చేయాలని కోర్టులో డిక్లరేషన్ ఇవ్వడం, రాయలసీమ ఎత్తిపోతల పథకానికి అడ్డంకులు సృష్టించడం, ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకోవడాన్ని తప్పుబట్టారు. రాయలసీమ బీజేపీ నాయకుల కర్నూలు డిక్లరేషన్ ఏమయిందని ప్రశ్నించారు. డీడీకేఎస్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, రైతు సంఘం ఉపాధ్యక్షులు జయన్న, శంకర్ రెడ్డి, యానాదయ్య, శేఖర్ రెడ్డి, సావంత్ సుధాకర్, పకీరప్ప పాల్గొన్నారు.

'ఏబీకే'కు రాజా రామ్మోహన్‌రాయ్ జాతీయ అవార్డు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జర్నలిజం రంగంలో అత్యుత్తమ సేవలందించినందుకుగాను డాక్టర్ ఏబీకే ప్రసాద్‌ను ప్రతిష్ఠాత్మక రాజా రామమోహన్ రాయ్ అవార్డుకు ఎంపిక చేసినట్లు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) ప్రకటిం చింది. ఏబీకేగా ప్రసిద్ధి చెందిన అన్నే భవానీ కోటేశ్వర ప్రసాద్‌కు పాత్రికేయ రంగంలో 75 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉంది. ఆంధ్రప్రదేశ్ నుంచి వెలువడిన ప్రధాన పత్రికలకు సంపాదకు లుగా పనిచేసిన అరుదైన గౌరవం ఆయనకు దక్కింది. 2004-2009 మధ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాష సంఘం అధ్యక్షుడిగా ఏబీకే సేవలందించారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలోని కమిటీ ఈ అవార్డును ప్రకటించింది. ఈనెల 28న దిల్లీలో7ని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా హాలులో జరిగే కార్యక్రమంలో ఏబీకేకు ఈ అవార్డు ప్రదానం చేస్తారు.

అదానీకి మోదీ రక్షణ సుస్పష్టం: రాహుల్

న్యూదిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతం అదానీకి ప్రధాని నరేంద్రమోదీ పూర్తిసంరక్షణ ఉన్నదని తాజా పరిణామాలతో స్పష్టమవుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. అమెరికా సంస్థ చేసిన ఆరోపణల నేపథ్యంలో అదానీ కంపెనీలపై విచారణకు ఆదేశాలివ్వకపోవడమే ఇందుకు నిదర్శనంగా తెలిపారు. తాను అడిగిన ప్రశ్నలకూ మోదీ సమాధానాలు ఇవ్వలేదని బుధవారం పార్లమెంటు అనంతరం విలేకరులతో మాట్లాడిన రాహుల్ అన్నారు. 'అడిగిన ప్రశ్నలకు జవాబు రాకపోతే అసంతృప్తి మిగులుతుందిగానీ ఇక్కడ నిజాలు బయటకొచ్చాయి' అని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. అదానీ సంస్థలపై విచారణ ప్రస్తావనే ప్రధాని నోట రాలేదని, మిత్రుడు కాకపోతే విచారణకు ఆదేశాలిచ్చేవారు కదా అని రాహుల్ అన్నారు. రక్షణ రంగంలో డొల్ల కంపెనీలపై విచారణ ఊసేలేదని, బినామీ డబ్బు చేతులు మారుతున్న ప్రస్తావన రాలేదని, ప్రధాని అసలు వాటి గురించి మాట్లాడలేదని చెప్పారు. ఈ వైఖరితో అదానీని మోదీ రక్షిస్తున్నారని స్పష్టమవుతోందని రాహుల్ అన్నారు. 'ఇది చాలా పెద్ద కుంభకోణం. కానీ ఆయన అది కూడా అనలేదు. అదానీని కాపాడేందుకు మోదీ యత్నిస్తున్నారు. ఇది అర్థం చేసుకోగలను. ఇందుకు కారణాలు లేకపోలేదు' అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు చెప్పారు. మీ ప్రశ్నలకు సమాధానాలు లభించాయా అని ఓ విలేకరి ప్రశ్నిస్తే లేదని సమాధానమిచ్చారు. 'ప్రధానమంత్రి అవాక్కయ్యారు. ఆయన షాక్‌కు గురైన కారణంగా నాకు సమాధానాలు లభించలేదు. నేనేమీ క్లిష్టమైన ప్రశ్నలు అడగలేదు. మీతో కలిసి అదానీ ఎన్నిసార్లు ప్రయాణించారు? ఆయనను ఎన్నిసార్లు కలిశారు? అనే అడిగా. కానీ సమాధానాలు రాలేదు' అని విలేకరుల ప్రశ్నకు రాహుల్ బదులిచ్చారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయంగా వాటిని మార్చడంలేదు

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ

న్యూదిల్లీ: ప్రస్తుతం ఉన్న ఏదైనా విద్యా సంస్థ లేదా విశ్వవిద్యాలయాన్ని కేంద్ర విశ్వవిద్యాలయంగా మార్చే ప్రతిపాదనను విద్యా మంత్రిత్వ శాఖ బుధవారం తోసిపుచ్చింది. రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుభాస్ సర్కార్ ఈ సమాచారాన్ని పంచుకున్నారు. 'కేంద్ర విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం అనేది నిరంతర ప్రక్రియ. అవసరమైనప్పుడు దానిని ఏర్పాటు చేయడం జరుగుతుంది. అటువంటి విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి నిర్దిష్ట ప్రమాణాలు లేవు. ప్రస్తుతం ఉన్న విద్యా సంస్థ లేదా విశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయంగా మార్చే ప్రతిపాదన లేదు' అని మంత్రి సర్కార్ వివరించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 54 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి.

ఇండియా ఎనర్జీ వీక్‌లో సత్తా చాటిన ఎంఈఐఎల్

అందరి దృష్టిని ఆకర్షించిన ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ టిప్పర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బెంగళూరులో ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు జరిగిన ఇండియా ఎనర్జీ వీక్-2023లో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) సత్తా చాటింది. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన ఇండియా ఎనర్జీ వీక్-2023లో ఎంఈఐఎల్ అనుబంధ డ్రిల్‌మెక్ ఇంటర్నేషనల్, పెట్రివెస్ ఎస్‌పిఎ, ఒలెక్ట్రా, మెగా గ్యాస్, ఐకామ్ సంస్థలు పాల్గొన్నాయి. ఎంఈఐఎల్ ఎండీ పీవీ కృష్ణా రెడ్డి, సంస్థలోని హైడ్రోకార్బన్స్ ప్రెసిడెంట్ రాజేశ్ రెడ్డి, డైరెక్టర్ దొరయ్య ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ తయారు చేసిన ఇండియాలోనే మొట్టమొదటి ఎలక్ట్రిక్ టిప్పర్ హైలైట్‌గా నిలిచింది. ఈ టిప్పర్ బ్యాటరీ ఒక్కసారి ఛార్జ్ చేస్తే 250 కిమీ వరకు ప్రయాణం చేయవచ్చు, రెండు గంటల్లోనే ఈ టిప్పర్ బ్యాటరీ పూర్తిగా ఛార్జింగ్ అవుతుంది. ఎలక్ట్రిక్ టిప్పర్ సందర్శకులనే కాకుండా హాజరైన ప్రతినిధులను కూడా ఆకర్షించింది. టిప్పర్ ఫీచర్స్, పనితనం స్వయంగా చూసినప్పుడు వారంతా ఎంతో ఆశ్చర్యం, ఆనందం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర కంపెనీలు ఇప్పటివరకు ఎలక్ట్రిక్ బైక్‌లు, సైకిళ్లు, కార్లు, ఆటోలు, మీడియం వాహనాల తయారీపై దృష్టి సారించాయి. వాటికి భిన్నంగా, ఓలెక్ట్రా ఎలక్ట్రిక్ టిప్పర్ నిర్మాణం కార్యక్రమంలో ప్రధాన చర్చగా మారింది. అలాగే ఐకామ్ టెలి లిమిటెడ్ తయారు చేస్తున్న మౌలిక సదుపాయాలు-సంబంధిత ఉత్పత్తులు-పవర్ టవర్లు, టెలికాం టవర్లు, కండక్టర్లు, ఫాస్టెనర్‌లు, సోలార్ మాడ్యూల్ మౌంటింగ్ స్ట్రక్చర్‌లు, రోడ్ ఇన్‌ఫ్రా ఫర్నిచర్, షెల్టర్‌లు, పోర్టబుల్ క్యాబిన్‌లు, ప్రీ-ఇంజనీరింగ్ భవన నిర్మాణాల స్ట్రక్చర్‌ల ఎగ్జిబిషన్ కూడా అందరి దృష్టిని ఆకర్షించింది. మేఘా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, 80 సీఎన్‌జీ స్టేషన్‌లతో భారతదేశపు రెండవ అతిపెద్ద సీఎన్‌జీ కంపెనీగా కొనసాగుతోంది. దేశంలోని 22 భౌగోళిక ప్రాంతాలలో పది రాష్ట్రాల్లో మేఘా గ్యాస్ సేవలు విస్తరించాయి. ఒలెక్ట్రా తయారు చేసిన ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా ఇప్పటివరకు 90 వేల టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించడం సాధ్యమైంది. 13 రాష్ట్రాలలో ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఈ-బస్సులు రోడ్లపై ప్రయాణిస్తున్నాయి. పునరుత్పాదక ఇంధన రంగంలో కూడా ఎంఈఐఎల్ అనేక సోలార్ ప్రాజెక్టులను అమలు చేసింది. భారతదేశపు మొట్టమొదటిసారిగా కాలువపైన సోలార్ ప్రాజెక్టును గుజరాత్‌లో నిర్మించింది. ఎనర్జీ రంగంలో బలమైన ఉనికిని కలిగిన భారతదేశ ముఖ్యమైన కంపెనీలలో ఎంఈఐఎల్ ముందువరుసలో ఉండటం గమనార్హం. దేశంలో పెరుగుతున్న ఇంధన డిమాండ్‌లను తీర్చడానికి, క్లీన్ ఎనర్జీ విభాగంలో మెరుగైన ఇంధన వ్యవస్థను రూపొందించడానికి ఎంఈఐఎల్ కృషి చేస్తోంది.

ధాన్యం సేకరణపై నిఘా వ్యవస్థ: కారుమూరి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ధాన్యం సేకరణ, ప్రజాపంపిణీ వ్యవస్థలో ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని ఆహార పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. విజయవాడ రూరల్ కానూరు పౌరసరఫరాల భవనంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కమాండ్ కంట్రోల్ రూమ్‌ను బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేశామని, దీని ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి పూర్తి సమాచారం తెలుస్తుందన్నారు. 13 ఉమ్మడి జిల్లాల్లోని కార్యకలాపాలను పర్యవేక్షిస్తామని తెలిపారు. రైతు పండించిన పంటకు సంబంధించి ధాన్యం సేకరణ, ప్రజాపంపిణీ వ్యవస్థ నందు మొబైల్ వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇంటికి అందించే కార్యక్రమం, ఎంఎల్ఎస్ గోడౌన్లను రైస్ మిల్లులు, స్టేజ్-1, 2 రవాణా వాహనాల కదలికలను సంబంధిత వివరాలను అనుసంధానం చేసి ఒకే చోటు నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షణ చేస్తామన్నారు. మొబైల్ వాహనాల కదలిక, ఇంటి వద్దే బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు పంపిణీ చేసే నిత్యావసర సరుకులను పర్యవేక్షిస్తామన్నారు. అన్ని మిల్లులలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి మిల్లింగ్ చేసే కార్యకలాపాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తామని, ఎలాంటి అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవడానికి ఈ సెంటర్ ఎంతో దోహదపడుతుందన్నారు.

తుది జట్టుపై తర్జన భర్జన

- సూర్య, గిల్... ఒకరికే అవకాశం
- నేడు నాగపూర్‌లో తొలిటెస్టు

నాగపూర్: భారత్-ఆస్ట్రేలియా మధ్య ఈ నెల 9 (గురువారం) నుంచి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ నాగపూర్ వేదికగా జరగనుండగా. ఈ మ్యాచ్‌కు అంతా సిద్ధమైంది. కాగా టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ కి వెళ్లాలంటే ఈ సిరీస్ కచ్చితంగా గెలవాలి. దీంతో క్రికెట్ అభిమానుల దృష్టి అంతా ఇప్పుడు ఈ మ్యాచ్‌పైనే ఉంది. ఈ నేపథ్యంలో టీమిండియా తుది కూర్పుపై ఊహాగానాలొస్తు న్నాయి. అయితే కంగారూలను ఢీకొట్టే తుది జట్టుపై కికెట్ విశ్లేషకుల అంచనాల ప్రకారం... 11మంది గల జట్టులో ఏడు స్థానాలపై ఎటువంటి సందేహాలు లేవు. రోహిత్ శర్మ, ఛతేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్‌కు చోటు పక్కా. వీళ్ల గత ఆటతీరు, ఫామ్, రికార్డులు.. ఇలా ఏవి చూసుకున్నా.. వీళ్ల ప్లేస్ గురించి ఆలోచనే అవసరం లేదు. జడేజా గత కొన్ని నెలలుగా గాయం కారణంగా దూరంగా ఉన్నా.. ఇటీవల రంజీలో దుమ్మురేపి జట్టులోకి వచ్చాడు. మిగతా నాలుగు స్థానాల మీదే చర్చ నడుస్తోంది. ఆ స్థానాల కోసం శుభ్‌మన్ గిల్, సూర్య కుమార్ యాదవ్, కె.ఎస్.భరత్, ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్ అందుబాటులో ఉండగా, ముగ్గురు తుది జట్టులో ఉంటారు. అయితే వాళ్లెవరూ అనేదానిపై చర్చ నడుస్తోంది. మిగిలిన నాలుగు స్థానాల్లో మూడో స్పిన్నర్ విషయానికొస్తే... టెస్టులు, అందులోనూ భారత్‌లో టెస్టులు అంటే మూడో స్పిన్నర్‌గా అక్షర్ పటేల్‌కి ఓటేస్తారు చాలా మంది. అయితే అక్షర్ కంటే కుల్‌దీప్ యాదవ్ అయితే నయమనే మాటలు వినిపిస్తున్నాయి. జడేజా, అక్షర్ బౌలింగ్ స్టయిల్ కాస్త దగ్గరదగ్గరగా ఉంటాయని, అందుకే వైవిధ్యం కోసం కుల్‌దీప్‌కు చోటివ్వాలని కొందరు మాజీలు సూచిస్తున్నారు. ఎలాంటి పిచ్ మీదనైనా బంతిని తిప్పేయడం అక్షర్ కంటే కుల్‌దీప్‌కే సాధ్యం అనేది చర్చ. అయితే బ్యాటింగ్‌ను కూడా పరిగణలోకి తీసుకుంటే అక్షర్‌కే ఎక్కువ మార్కులు పడతాయి. రెండోది వికెట్ కీపర్

రిషబ్ పంత్ స్థానంలో రేసులోకి కె.ఎస్.భరత్, ఇషాన్ కిషన్ వచ్చారు. పంత్ స్థానానికి ఇషాన్ అతికినట్లు సరిపోతాడు కానీ రంజీట్రోఫీల్లో బ్యాటింగ్‌లోను, కీపింగ్‌లోనూ అదరగొట్టడం, జట్టులో చాలా రోజులు బెంచ్ మీద ఉండటం లాంటి అంశాలు భరత్‌కు కలిసొస్తాయి అంటున్నారు పరిశీలకులు. గాయంతో శ్రేయస్ అయ్యర్ జట్టుకు దూరం అవ్వడంతో ఆ స్థానం కోసం సూర్య కుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్ పోటీ పడుతున్నారు. ఇప్పటికే గిల్ టెస్టుల్లో మూడు అర్థ సెంచరీలు, ఒక సెంచరీతో అదరగొట్టాడు. దీంతో గిల్, సూర్య మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది. ఫామ్‌కి ఓటేస్తారా.. తొలి ఛాన్స్ ఇచ్చి టెస్టులకు సూర్యని పరిచయం చేస్తారా అనేది చూడాలి. టీమ్‌లో పంత్ లేని నేపథ్యంలో దూకుడైన ప్లేయర్ కావాలంటే సూర్య ఉండాల్సిందే. ఇటీవలి ఫామ్‌ను దృష్టిలో పెట్టుకుంటే గిల్‌ను తీసుకుంటారు. అయితే మిడిలార్డర్‌లో ఆడటానికి సిద్ధం అని కేఎల్ రాహుల్ ఇటీవల చెప్పిన నేపథ్యంలో ఓపెనింగ్ స్థానం ఖాళీ అని తెలుస్తోంది. ఒకవేళ ఇదే జరిగితే శుబ్‌మన్‌కే ఫైనల్ 11లో చోటు దక్కే అవకాశం ఉంది. ఒకవేళ భరత్ బదులు ఇషాన్‌ను తీసుకుంటే.. అతను ఓపెనింగ్ చేస్తాడు కాబట్టి.. అప్పుడు సూర్యకు జట్టులో చోటు ఉండొచ్చు. గిల్ బెంచ్‌కే పరిమితమవుతాడు. దానికితోడు రాహుల్ మిడిలార్డర్‌లోనే రాణిస్తుండటంతో.. జట్టు యాజమాన్యం కొత్త ఓపెనర్ ఆలోచనలో పడింది అంటున్నారు. ఒకవేళ ఓపెనర్ అనే పాయింట్ చర్చకు వస్తే.. సూర్యకి కష్టమే. ఇక చర్చలో ఉన్న మరో అంశం మూడో పేసర్. అయితే అనూహ్యంగా ముగ్గురు పేసర్లతో భారత్ బరిలోకి దిగాలి అనుకుంటే అక్షర్/ కుల్‌దీప్ స్థానంలో జయదేవ్ ఉనద్కత్ వచ్చే అవకాశం ఉంది.

తుది జట్టు అంచనా: రోహిత్ శర్మ (కెప్టెన్), కె.ఎల్.రాహుల్ (వైస్ కెప్టెన్), ఛతేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్/ శుబ్‌మన్ గిల్, కె.ఎస్.భరత్/ ఇషాన్ కిషన్ (కీపర్), రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ / కుల్‌దీప్ యాదవ్, రవిచంద్రన్ అశ్విన్, మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమీ.

13న వైసీపీ కీలకభేటీ?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల కసరత్తును వేగవంతం చేసిన వైసీపీ అధినేత, సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు ప్రజల్లోకి వచ్చేందుకు సిద్ధమయ్యారు. తనతో పాటు నేతలంతా ప్రజల్లోనే ఉండేలా కొత్త కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్త పర్యటనకు నడుం బిగించిన క్రమంలో జగన్ క్షేత్రస్థాయి పరిస్థితులు, ఎమ్మెల్యేల పనితీరుపై దృష్టిపెట్టారు. '175' నినాదంతో ఎన్నికల్లో ముందుకెళ్లేందుకుగాను గడప గడపకు ప్రభుత్వం పేరుతో ఎమ్మెల్యేలను ప్రజల్లోకి పంపారు. ఇదే క్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీలోని ముఖ్య నేతలతో ఆయన కీలక సమావేశాన్ని ఈనెల 13న ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. గత సమావేశంలో ప్రతీ సచివాలయ పరిధిలో కన్వీనర్లు, గృహసారథుల నియమాకంపై నిర్ణయాలు జరిగాయిగానీ ఇప్పటివరకు నియామకాలు పూర్తి కాకపోవడాన్ని జగన్ తీవ్రంగా పరిగణించారు. ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. నెల్లూరు జిల్లా పరిణామాల దృష్ట్యా కఠిన నిర్ణయాలకు జగన్ సిద్ధమయ్యారు. ప్రజల్లో ఎమ్మెల్యేల గ్రాఫ్‌పైనా దృష్టిపెట్టారు. ఎన్నికలకు ఆరు నెలల ముందే టికెట్లు ఖరారు చేస్తామని ఆయన ఇప్పటికే స్పష్టంచేశారు. దీంతో తాజా సమావేశంలో జగన్ ఏం ప్రకటిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.